తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## మానవత్వపు పరిమళం
# మూగబోయింది..!
## కూచివారిపల్లిలో దంపతుల ఆత్మహత్య





(ఫైల్‌ఫోటో)

చంద్రగిరి, డిసెంబర్ 25 ప్రభాతవార్త
సామాజిక స్పృహ కలిగిన ఆ దంపతుల మానవత్వపు పరిమళం మూగబోయింది. మండల పరిధిలోని కూచివారిపల్లిలో బుధవారం సురేంద్ర నాయుడు (50), లత (45) దంపతులు తమ వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మూడుముళ్ళ బంధంతో ఒక్కటైన ఆ జంట వందేళ్ళ జీవిత ప్రయాణం మరణంలోనూ కలసి కొనసాగడం పట్ల గ్రామస్థులంతా కన్నీటి పర్యంతమవుతున్నారు. తిరుపతి వైకుంఠపురం ఆర్చి సమీపంలోని గాంధీపురం పంచాయతీలో నివాసం వుంటున్న సురేంద్రనాయుడు విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కోట్ల విలువైన ఆస్తులు కలిగిన ఆ దంపతులలో ఈసు మంతైనా అహం లేకపోగా వారిలోని సామాజిక స్పృహతో అందరి మన్ననలు పొందుతున్నారు. సాయం కోరి వచ్చే వారికి తమవంతు సహకరించడం ఆ దంపతుల దినచర్యగా గ్రామస్థులు వాపోయారు. ఆ దంపతుల అన్యోన్య దాంపత్య జీవితానికి ఇద్దరు కుమార్తెలు జన్మించారు. వారిని అల్లారుముద్దుగా అత్యున్నత స్థితిలోకి తీసుకువచ్చి వివాహాలు జరిపించడంతో అమెరికాలో స్థిరపడ్డారు. ఇంతలోనే ఏకష్టం వచ్చిందో విధి వారిని స్వయంకృత విగతజీవులను చేసింది. అయితే చివరి శ్వాస సైతం కలసి విడిచి మృత్యుఒడిలోకి జారుకోవడం హృదయ విదారకంగా మారింది. దంపతుల ఆత్మహత్య సమాచారం అందుకున్న డిఎస్పీ ప్రసాద్, తిరుపతి రూరల్ సిఐ చిన్న గోవింద్ సంఘటనా స్థలికి చేరుకున్నారు. శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

## తడ ప్రాంతంలో మళ్లీ వర్షాలు

*తడ, డిసెంబర్ 25 ప్రభాతవార్త*

*తడ ప్రాంతంలో మళ్లీ వర్షాలు మొదలయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తమిళనాడు సరిహద్దుల్లో వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం ఇక్కడ 5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మరోవైపు గత నాలుగైదు రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో మత్స్యకారులు పులికాట్ సరస్సులోకి వేటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. విదేశీ వలస విహంగాలకు మాత్రం సరస్సులో నీళ్ల దండిగా ఉండటంతో స్వేచ్ఛగా విహరించే అవకాశం లభించింది. అయితే జనవరి 10 నుంచి జరపతలపెట్టిన ఫ్లెమింగో ఫెస్టివల్ సంక్రాంతి అనంతరం మాత్రమే జరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఇంకోవైపు వాతావరణ ప్రభావంతో కొన్నిచోట్ల ఫ్లెమింగో ఫెస్టివల్ పనులకు కూడా అంతరాయం తప్పలేదు.*

## డిగ్రీవిద్యార్థి ఉసురుతీసిన మొబైల్‌గేమ్

పుంగనూరు,డిసెంబరు 25 ప్రభాతవార్త
ఆధునిక సమాజంలో మొబైల్‌ఫోన్లు కుటుంబాలను,బంధాలను ఎంతగా విచ్చిన్నం చేశాయో ప్రత్యక్ష్యంగా చూస్తునా న్నం. అంతకంటే వేలరెట్టు మొబైల్‌ఫోన్ గేమ్‌లు పిల్లల జీవితాలను బలి గొంటున్నాయి. మొబైల్ గేమ్‌లు ఆడి సమయం వృధాచేసుకోవద్దని తల్లి మందలించడంతో డిగ్రీ చదువుతున్న ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషాదఘటన పుంగనూరు పట్టణంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని చింతలవీధిలో నివసించే మేస్త్రీ రెడ్డెప్ప దంపతుల కుమారుడు శ్రీనివాసులు స్థానికంగా ఒక ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు.అయితే, ఇతను చదవులకు ప్రాధాన్యత ఇవ్వక మొబైల్ గేమ్ వ్యసనం బారినపడ్డాడు. ఇంట్లో ఉంటూ ఎపుడూ మొబైల్‌గేమ్‌లు ఆడుతుండడంతో మంగళవారం సాయంత్రం తల్లి మొబైల్ లాక్కుని మందలించింది. దీంతో ఇంటినుంచి అలిగివచ్చిన శ్రీనివాసులు ఆరాత్రే పట్టణంలోని పుష్కరిణిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం అతని పాదరక్షలు గమనించిన స్థానికులు అగ్నిమాపకసిబ్బందికి సమాచారంఇవ్వడంతో సిఐ సుబ్బరాజు అధ్వర్యంలో సిబ్బందితో పాటూ గజ ఈతగాళ్ళ, లైఫ్‌బోట్లసాయంతో కోనేరు అడుగున ఉన్న శ్రీనివాసులు శవాన్ని వెలికి తీశారు.

# ముసారంతో వణుకుతున్న జనం

## జ్వరాలతో ఆసుపత్రులు కిట కిట
## తెగుళ్ళతో వాలుతున్న వరి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 25 ప్రభాతవార్త
వరస అల్పపీడనాలు శ్రీకాళహస్తి సత్యవేడు నియోజకవర్గాలను వణికిస్తున్నాయి.ఈ నెలలో మూడు అల్పపీడనాలు చోటు చేసుకున్నాయి. గత వారం రోజులుగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సూరీడు దర్శనమివ్వలేదు. మూడు రోజులు గత 60 సంవత్సరాలుగా లేని విధంగా చలి ఇబ్బంది పెడుతుంది.ఓ వైపు చలితో జనం వణుకుతుంటే ముసారంతో వరి పంటకు తెగుళ్ళు ఆశించి పంటలు దెబ్బతింటున్నాయి. వర్షంకూడా కొత్త రకంగా ఉంది.మంచువర్షంలా కురుస్తుంది. కంటికి కనబడకుండా కురుస్తుంది. బయటకు పోతే తడిసి ముద్దౌతున్నారు.ఇక వరి పైరును చేత బట్టుకొని రైతులు ఎరువులు, మందుల దుకాణాల వద్ద జనం క్యూకడుతున్నారు.వ్యవసాయశాఖ ప్రకటనలు తప్ప క్షేత్రస్థాయిలో వెళ్ళి పరిశీంచటం లేదు.

**జ్వరాలతో జనం సతమతం:ఆసుపత్రులు కిట**

సాధారణంగా సీజన్ మారే నవంబర్ మాసంలో సీజనల్ జ్వరాలు సోకటం సాధారణం.ఈ సారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఏ ఇంటిలో చూసినా చిన్నా పెద్దా తేడా లేకుండా కునుకు తీస్తున్నారు. దుప్పట్లు కప్పుకొని మంచాల మీద పడుకోవటం కనబడుతుంది. దాంతో ఆసుపత్రులు కిట కిట లాడుతున్నాయి. డాక్టర్లకు మంచి డిమాండ్ పెరుగుతుంది. శ్రీకాళహస్తిలోసుమారు 50 క్లినిక్‌లు, మరో 30 ఆర్ఎంపి డాక్టర్లు ఉన్నారు. వంద పడకల ప్రభుత్వాసుపత్రి ఉంది. ఎక్కడ చూసినా పేషెంట్లు కిట కిట లాడుతున్నారు.దాంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీనికి తోడు కుక్కల బాధ. జ్వరాలు సోకితే వారం పదిరోజులు సాధారణ స్థితికి రాలేక పోతున్నారు. జ్వరంతో పాటు జలుబు దగ్గులు సోకి సతమతమౌతున్నారు. ఆసుపత్రులకు వెళితే జేబులు ఖాళీ అవుతున్నాయి.ఒక జబ్బుకు డాక్టర్లు కనీసం 5-6 రకాల గుళికలు రాస్తున్నారు.వాటిని మింగలేక నోరు చేదు,ఏమీ తినటానికి వీలు లేని స్థితి చోటు



ఆసుపత్రుల్లో వైద్యం కోసం నిరీక్షిస్తున్న బాధితులు

చేసుకుంది.డాక్టర్ల ఫీజులు,వెంటనే ల్యాబ్ టెస్టింగ్‌లు, వెంటనే మందుల కొనుగోళ్ళతో ఒక ఇంటిలో ఒకరికి జ్వరం వస్తే వరుస బట్టి అందరికి సోకుతున్నాయి. ఏడాది ఆదాయం నెలలో సరిపోతుంది.

**ఏం జ్వరాలు నిర్ధారించలేకపోతున్న డాక్టర్లు:**

ఎవరికైనా ఒక సారి జ్వరం వస్తే అది ఏం జ్వరమో నిర్ధారించలేకపోతున్నారు. గతంలో స్పష్టంగా మలేరియా?టైఫాయిడ్? చికున్ గున్యా? అనేది నిర్ధారించి వైద్యసదుపాయాలు అందించే వారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు.డాక్టర్ల వద్దకు వెళుతూనే ల్యాబ్‌కు రాస్తున్నారు.దాంతో జ్వరం సోకిన ఒకటి రెండు రోజుల్లో వెళితే 'టైఫాయిడ్' అని చూపుతుంది. దానికి కోర్సు వాడుతున్నా తగ్గటం లేదు. ఇక మరో రకం జ్వరం 'చికున్ గున్యా' ఇది సోకితే కాళ్ళు,చేతుల జాయింట్లు విపరీతమైన నొప్పి.కనీసం లేచి తిరగలేని స్థితి చోటు చేసుకుంది. ఒక సారి చికున్ గున్యా సాకితే నెల రోజుల వరకు రికవరి కాలేక పోతున్నారు.

# ఉపాధి హామీ సొమ్ము స్వాహా!

## -సిబ్బందికి కాసుల వర్షం



రామచంద్రాపురం, డిసెంబరు 25 ప్రభాతవార్త:
జాతీయ ఉపాధి హామీ పథకంలో అవకతకలు పేట్రేగిపోతుండటంతో నిధుల సంగతి గోవిందా గోవింద అంటున్నారు. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని పేదల వలసలను నివారించడమే లక్ష్యంగా గ్రామాల్లోనే పనులు కల్పించి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నది. ఈ పథకానికి కేంద్రం నిధులు పుష్కలంగా విడుదల చేస్తున్నది. ఉపాధిహామీ పథకంలో నీటి నిల్వ పనులు, రైతులకు పండ్ల తోటల పెంపకం వంటి పనులు చేపట్టడానికి నిధులు అందిస్తుంది. కానీ క్షేత్ర స్థాయిలోని సిబ్బంది చేతివాటం ప్రదర్శించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో క్షేత్ర స్థాయి సిబ్బందికి సిరుల పంట కురిపిస్తున్నది. కొలతలు నమోదు చేయవలసిన టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్ర స్థాయికి వెళ్ళకనే ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద ముడుపులు తీసుకుని ఇష్టారాజ్యంగా ప్రభుత్వ సొమ్మును స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏటా జరిగే సామాజిక తనిఖీలు సైతం తూతూ మంత్రంగా జరిపించి చేతులు దులుపుకుంట్లు బహిరంగ విమర్శలు వినబడుతున్నాయి.

**-సిబ్బంది చేతివాటం ఇలా..!**

పట్టణాలలో ప్రైవేటు హాస్పిటల్స్, షాపులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. తిరుపతి, బెంగుళూరు వంటి పట్టణాలలో నివశించే వారికి సొంత గ్రామాలలో క్షేత్ర స్థాయి అధికారులు జాబ్ కార్డులను పుట్టిస్తున్నారు. తద్వారా ఇక్కడ ఉపాధిహామీ పనుల్లో సిబ్బంది వీరికి మస్టర్లు పెట్టి సొమ్ముకుంటున్నారు. ఇంకా విచిత్రమేమిటంటే పనికివెళ్ళలేని వృద్ధులు, అనారోగ్యంతో మంచం పట్టిన రోగులు సైతం పనులకు వెళ్తున్నట్లు చూపుతారు. గ్రామాల్లో నివశించే వృద్ధులు, వ్యాధిగ్రస్థులు తమ ఖాతాలో పడిన నగదును విత్ డ్రా చేయిస్తే ఇందుకు గానూ రూ.100/-లు చెల్లిస్తారు. లేదా వారి ఏటిఎంలను ఉపాధిహామీ సిబ్బంది తీసుకుని విత్ డ్రా చేసుకుంటున్నారు. ఈ మేరకు సిబ్బంది చేతివాటం ప్రదర్శించి లక్షలాధిరూపాయలు దోచుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని పంచాయతీలలో పనులు చేయకనే బంధువులు, స్నేహితుల ఫోటోలు తీయించి ఉపాధిహామీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దీంతో పాతపనులకు కొత్త మెరుగులు దిద్ది తిరిగి మరోసారి బిల్లులు చేసుకుంటున్నట్లు తెలిసింది. మరి కొన్ని పంచాయతీలలో కొంత మంది నాయకులు కాంట్రాక్టర్ల అవతారమెత్తి కూలీలలను ఆటోలలో తరలించి పనులు చేయించి ఉపాధిహామీ ద్వారా మస్టర్లు పెట్టి బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఇకనైనా అధికారులు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అవినీతి అక్రమాలను దేగకళ్ళతో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# సంక్రాంతి తరువాతే "నామినేటెడ్"!

## -ఆశలు రేపుతున్న "తుడ" ,మార్కెట్ కమిటీలు



ప్రభాతవార్త-తిరుపతి:
అదిగో ఇదిగో అంటూ తెలుగుతమ్ముళ్ళను ఊరిస్తూ వచ్చిన మలివిడత నామినేటెడ్ పదవులు సంక్రాంతిపండుగ తరువాతేననే ప్రకటనతో ఆశలు నీరుగారిపోతున్నాయి. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో ముఖ్యంగా తుడ ఛైర్మన్ పదవితోబాటు డైరెక్టర్ పదవులకు పలువురు టిడిపి సీనియర్ నేతలు తమతమ స్థాయిలో అధినేత,సిఎం చంద్రబాబును కలసి మనసులో మాట వ్యక్తం చేసేశారు. పార్టీ కష్టకాలంలో ప్రాణాలకు తృజించి కలసి పనిచేశామని, ఇప్పుడు అదికారంలోకి వచ్చిన తరువాత తమకు గుర్తింపు ఇవ్వకుంటే ఎలా అని తమ మాటగా అదినేతకు మొరపెట్టుకున్నారు. ఇప్పటికే పలువురు నేతలకు పలు కీలక పదవులను కట్టబెట్టిన ముఖ్యమంత్రి మలివిడతలో ముఖ్యంగా తుడ ఛైర్మన్ పదవికోసం టిడిపిలోనే పలువురు సీనియర్ నేతలు పట్టుబడుతున్నారు. ఈ పదవిలో ఉన్న నాయకునికి టిటిడి బోర్డులో ఎక్స్ అఫిషియో సభ్యత్వం దక్కుతుంది. అదేతగాక తుడ పరిధి విస్తరించడంతో ఇప్పుడు ఇక్కడ ప్రాధాన్యత ఉంది. ఇక తిరుపతి మార్కెటింగ్ కమిటీ,పాకాల మార్కెటింగ్, చంద్రగిరి ,పుత్తూరు ,దామలచెరువు వంటి ప్రధాన మార్కెటింగ్ కమిటీల ఛైర్మన్ల పదవులను పలువురు కూటమి నేతలు ఆశిస్తున్నారు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో జిల్లాలో బిజెపి నాయకత్వం బలంగా లేకపోవడం, పట్టు కూడా నామమాత్రమే కావడంతో టిడిపి, జనసేన పార్టీల నేతల మధ్యే పోటీ నెలకొంది. 2024 ఎన్నికల్లో జనసేనపార్టీ, బిజెపితో కలసి టిడిపి కూటమిపార్టీగా పోటీ చేశాయి. అయితే తిరుపతి నియోజకవర్గంలో తప్ప మిగిలిన చోట్ల టిడిపి ఎంఎల్ఏలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తిరుపతి ఎమ్మెల్యే పార్టీలో కేవలం త్రిమూర్తులకు మాత్రమే ప్రాధాన్యత నిచ్చి, పెత్తనం చలాయించేలా చూస్తుడంటంతో టిడిపి నేతలు కస్సుమంటున్నారు. తిరుపతి ప్రజలు కూడా ఎమ్మెల్యే తీరుపై అసహనం చెందుతున్నారు. మలివిడత నామినేటెడ్ పదవులు వస్తాయని తిరుపతికి చెందిన మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పలువురు సీనియర్ నేతలు సూరాసుధాకర్‌రెడ్డి, బుల్లెట్ రమణ, ఆర్‌సి మునికృష్ణ, శ్రీధర్‌వర్మ, పుష్పావతియాదవ్, మబ్బు దేవనారాయణరెడ్డి, పులుగోరు మురళి, కంకణాల రజినీకాంత్‌నాయుడు పలువురు వేచిచూస్తున్నారు. నామినేటెడ్‌లో పలు కీలక పదవులు ఉన్నా టిడిపిలో ఎవరికి దక్కుతాయనేది మాత్రం ఇక సంక్రాంతి పండుగ తరువాతేనని తేలిపోయింది. తిరుపతి,శ్రీకాళహస్తి, నగరి, చంద్రగిరి, చిత్తూరు నియోజకవర్గాల నుండి కూటమి పార్టీల్లో టిడిపికే అధికసంఖ్యలో కేడర్ బలంఉంది. ప్రాధాన్యత ఉన్న నాయకులు ఉన్నారు. నామినేటెడ్ పదవులు కష్టపడిన వారికే ఇవ్వాలనే వాదన బలంగా వినిపిస్తున్నారు.

## కరెంటు షాక్‌కు గురై
# రైతు మృతి





కరెంటు షాక్‌తో మృతి చెందిన రైతు రఘురామయ్య
రఘురామయ్య(ఫైల్‌ఫోటో)

వడమాలపేట, డిసెంబరు 25 ప్రభాతవార్త:
కరెంటు షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన వడమాలపేట మండలంలోని కల్లూరు గ్రామంలో జరిగింది. పోలీసుల, బాధితుల వివరాల మేరకు... కల్లూరు గ్రామంలో నివాసం ఉంటున్న బత్తిని రఘురామయ్య(65) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రఘురామయ్యకు భార్య, కుమారుడు ఉన్నారు. 23వ తేదీ సోమవారం తత్నేరి గొల్లపల్లిలో తమ బంధువులు మాలవేసి ఇరుముడి కడుతుండడంతో అక్కడికి వెళ్లాల్సి ఉంది ఆయన. భార్య మునీంద్రను పంపిస్తూ పని చూసుకుని సాయంత్రంగా వస్తానని చెప్పాడు. భార్య వెళ్లిన తరువాత ట్రాక్టర్ తీసుకుని రఘురామయ్య పొలం వద్దకు వెళ్లాడు. ట్రాక్టర్‌తో పొలం దున్ని మోటారు వేసేందుకు వెళ్లారు. అక్కడ కరెంటు షాక్ తగిలి మృతి చెందాడు. జరిగిన సంఘటన తెలియలేదు. సోమవారం సాయంత్రం భర్త గొల్లపల్లికి రాకపోవడంతో ఇకరాదని అనుకుంది. భార్య ఇంటి వద్ద లేకపోవడం కుమారుడు హాస్టల్‌లో ఉండడంతో విషయం ఎవరికి తెలియలేదు. మంగళవారం రఘురామయ్యకు భార్య పలుమార్లు ఫోన్ చేసినా తీయకపోవడంతో పొలం పనిలో బిజీగా ఉన్నాడు అనుకుంది. మంగళవారం రాత్రి మరలా ఫోన్ చేస్తే తీయకపోవడంతో అనుమానం వచ్చి గ్రామంలోని బంధువులకు ఫోన్ చేసింది. వాళ్లు రఘురామయ్య ఇంటికి వెళ్లి చూశారు. ఇంటికి తాళం వేసి ఉందని చెప్పడంతో పక్కింటి వారిని అడిగితే గొల్లపల్లికి వెళ్లాడు అనుకుంటున్నామని చెప్పారు. దీంతో గొల్లపల్లిలోని బంధువులు కల్లూరు గ్రామానికి వెళ్లి గ్రామస్తులను తీసుకుని పొలం వద్దకు వెళ్లారు. పొలంలో ట్రాక్టర్ ఉండడంతో ఏదో జరిగిందని అనుమానంతో మోటారు వద్దకు వెళ్లి చూడగా మోటారు పక్కన పడిపోయి ఉన్నాడు. బాడి నల్లగా తిరిగిపోయి ఉండడంతో కరెంటు షాక్ కొట్టి చనిపోయినట్టుగా నిర్ధారించుకుంటున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని బుధవారం ఉదయం వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ భాస్కర్‌రాజులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారెడ్డి తెలిపారు. కరెంటు షాక్‌తో మృతి చెందిన రఘురామయ్య ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కల్లూరు చెరువుకు ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఆఫ్‌లైన్‌లో వైకుంఠద్వార దర్శనానికి జనవరి 9న టోకెన్లు జారీ





తిరుమల,డిసెంబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:
ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పరమపవిత్రమైన మోక్షమార్గం వైకుంఠద్వార దర్శనాలకు ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో టోకెన్లు జారీకి టిటిడి ఏర్పాట్లు చేసింది. రోజుకు 40వేల సర్వదర్శన ఉచిత టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తారు. జనవరి 10,11,12తేదీలకు మూడురోజులకు సంబంధించి 9వతేదీనే 1.20లక్షల టోకెన్లు ఒకేసారి జారీ అవుతాయి. మిగిలిన ఏడురోజులకు సంబంధించి ఏ రోజుకా ముందురోజు టోకెన్లను తిరుపతిలోని 8కౌంటర్లలో, తిరుమలలోని 4కౌంటర్లలో జారీ చేసేలా టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నిర్ణయించారు. 10వతేదీ నుండి 19వరకు పదిరోజులు తెరచివుంచే వైకుంఠద్వార దర్శనాల టోకెన్లు అందుకునేందుకు వచ్చే సామాన్య భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ టోకెన్లను జనవరి 9వతేదీ ఉదయం 5గంటల నుండి జారీచేస్తారు. తిరుపతిలోని శ్రీనివాసం,విష్ణునివాసం, భూదేవికాంప్లెక్స్, రామచంద్రపుష్కరిణి, ఇందిరామైదానం, జీవకోనలోని జడ్పీ ఉన్నతపాఠశాల, బైరాగిపట్టెలోని రామానాయుడు ఉన్నతపాఠశాల, ఎంఆర్‌పల్లిలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉచితంగా ఈ వైకుంఠ ద్వార దర్శన టోకెన్లు జారీ అవుతాయి. తిరుమలవాసులకు స్థానికంగానే బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తారు. తిరుపతిలోని 9చోట్ల కౌంటర్లను, ఏర్పాట్లను, సౌకర్యాలను బుధవారం మధ్యాహ్నం టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ,జెఈఓ గౌతమి,తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఓ శ్రీధర్, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి పరిశీలించారు.

# పబ్లిసిటీ లేక.. ఖాదీ మహోత్సవ ఎగ్జిబిషన్ షో అట్టర్ ఫ్లాప్






ఖాదీ మహోత్సవం ఎగ్జిబిషన్ ఫైల్ ఫోటో, కొనుగోలు దారులు లేక పోవడంతో పేపరు చదువుకుంటున్న స్టాల్స్ యజమానులు, నిర్వాహకులు

## ప్రభుత్వ మంజూరు నిధులు రూ.37లక్షలు వృధా
## మొదట వంద స్టాల్స్‌ప్రారంభం...వెనుతిరిగి వెళ్ళిపోయిన దాదాపు 40 స్టాల్స్
## అధికారులు, ఇన్‌చార్జులు, కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్టాల్స్ యజమానులు, నిర్వాహకులు

తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త
అట్టహాసం తిరుపతి తిరుచానూరు శిల్పారామంలో ఈ నెల 20వ తేది నుంచి 29 వ తేది వరకు పది రోజులు పాటు ప్రారంభంమైన ఖాదీ మహోత్సవం -2024 షో అట్టర్ ఫ్లాఫ్ అయిందని చెప్పక తప్పదు. ఈ మహోత్సవానికి దాదాపు రూ. 37లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు సమాచారం. ఇందులో శిల్పారామకు పది రోజులు రెంట్‌కు రోజు రూ.లక్ష చొప్పున పది రోజులకు రూ. 10లక్షలు. దీంతో పాటు జీఎస్టీ.ఇతరత్రా ఖర్చులతో కలిపి దాదాపు 12 నుంచి 13 లక్షల రూపాయలు అవుతుందని శిల్పారామం పరిపాలన భవనం క్రిందిస్థాయి సిబ్బంది నుంచి వినిపిస్తున్న వ్యాఖ్యలు. మిగతా రూ. 24లక్షలలో కాంట్రాక్టర్లకు 2నుంచి 5 శాతం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ డబ్బులలో ఎంత సొమ్ము పబ్లిసిటికీ ఖర్చు చేశారో ఆ ఎగ్జిబిషన్ అధికారులు, ఇన్‌చార్జిలు, కాంట్రాక్టర్లకే ఎరుక. ఇది పక్కన బెడితే ఏపీలోని వివిధ జిల్లాలు అనంతపురం, కడప, తిరుపతి, తదితర జిల్లాల నుంచి షో ప్రారంభంలో వంద స్టాల్స్ యజమానులు, నిర్వాహకులు వారు ఉత్పత్తి చేసిన వస్తువులను అమ్ముకునేందుకు ఒక్కొక్క స్టాల్స్‌కు రూ. 1500లు నుంచి రూ. 2000లు రెంట్ ఇస్తున్నట్లు స్టాల్స్ యజమానులు, నిర్వాహకులు చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టుకుని పది రోజుల పాటు నిద్రాహారాలు మాని ఒక పక్క రెంట్‌లు కట్టుకుని మూడు పూట్ల భోజనం చేసుకుని,పనివాళ్ళను పెట్టుకుని వారికి జీతాలు ఇచ్చి స్టాల్స్ యాజమానులు, నిర్వాహకులు మిగిలేది శూన్యం. దీంతో వంద స్టాల్స్ నుంచి రెండు, మూడు రోజులు తిరగక మునుపే దాదాపు బుధవారం నాటికి దాదాపు 40 స్టాల్స్ యాజమానులు, నిర్వాహకులు స్టాల్స్ మూసుకుని తిరిగి ఇళ్ళకు పయనం అయ్యారు.దీంతో ఎగ్జిబిషన్ యజమానులు, నిర్వాహకులు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసిన అధికారులు, ఇంచార్జిలు, కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పబ్లిసిటి ఇవ్వకుండా మమ్మల్ని సుదూర ప్రాంతాల నుంచి రమ్మని కొనుగోలు దారులు రాని ప్రాంతాల్లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి మా జీవితాలతో చెలగాటాలు ఆడవద్దని, దీనిపై సంబంధిత ఎగ్జిబిషన్ అధికారులు, సిబ్బంది, ఇంచార్జిలు, కాంట్రాక్టర్లపై ఉన్నత అధికారులు తగు చర్యలు తీసుకోవడంతో పాటు మరో పర్యాయం ఇలా జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని స్టాల్స్ యాజమానులు, నిర్వాహకులు, సొసైటీ నేతలు, ప్రతినిధులు బృందం, సభ్యులు పెద్ద ఎత్తున ఆరోపణలు చేయడం కొసమెరుపు.

ఖాదీ మహోత్సవం -2024 ఎగ్జిబిషన్ ఇంచార్జి కోటిరెడ్డిని ఫోన్‌లో వివరణ కోరగా పూర్తి స్థాయిలో పబ్లిసిటీ ఇచ్చామని, న్యూఢిల్లీలో ఉన్న ఆయన పై అధికారి గురుబాబు మాట్లాడుతూ ఎగ్జిబిషన్ నిర్వహణకు రూ. 37లక్షలు మంజూరు అయ్యాయని, శిల్పారామంలో రోజుకు ఒక రూ.1లక్ష అని, అలాగే జీఎస్టీ ఉందని, ఎగ్జిబిషన్ నిర్వహణ అంతా ఓ కాంట్రాక్టర్‌కు ఇవ్వడం జరిగిందని చెప్పారు. అయితే సరైన పబ్లిసిటీ లేక పోవడం,కొనుగోలు దారులు ప్రజలు లేని టౌన్‌కి దూరంలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం వలన ప్రజలు కొనుగోలు దారులు రాక పోవడంతో పది రోజులు పాటు నిద్రాహారాలు మాని పైసా ఆదాయం లేక పోవడంతో స్టాల్స్‌ను మూసివేసి వారి వారి ఇళ్ళకు తిరిగి వెళ్ళడంతో, ఎగ్జిబిషన్ నిర్వాహకులు, ఇంచార్జిలపై ఒకానొక దశలో వారు ఆగ్రహం వ్యక్త చేయడం కొసమెరుపు.

## బిజెపి మహిళా అధ్యక్షురాలిగా గుత్తా ఉషా



పెనుమూరు, డిసెంబర్ 25 ప్రభాతవార్త: మండల భారత జనతా పార్టీ మహిళా అధ్యక్షురాలిగా గుత్తా ఉషా, మండల ప్రధాన కార్యదర్శి దేవళ్ళ పరంధామయ్యలు నియమితులయ్యారు. బుధవారం స్థానిక బిజెపి కార్యాలయంలో ఎన్నికల ఆర్ఓ అరుణమ్మ సమక్షంలో ఏకగ్రీవంగా మండల పార్టీ కార్యవర్గంను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిడినెల్లూరు బిజెపి ఇన్‌ఛార్జీ రాజేంద్రన్, జిల్లా బిజెపి కార్యదర్శి బికె చౌదరి, బిజెపి మండల అధ్యక్షులు గుత్తా వాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ వైకాపా నాయకుడు మృతి



పాలసముద్రం, డిసెంబర్ 25 ప్రభాతవార్త:పాలసముద్రం మండలం ఆముదాల పంచాయతీకి చెందిన సీనియర్ వైకాపా నాయకుడు వెంకటేష్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. అనారోగ్యంతో మృతి చెందిన వెంకటేష్ మృతదేహానికి జిడినెల్లూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ కృపాలక్ష్మీ నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా అధ్యక్షుడు తులసీయాదవ్, జడ్పీటీసీ అన్బుగలన్, నాయకులు ముదివానన్, కేశవరెడ్డి, పోలయ్య, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కల్లూరు, డిసెంబర్ 25, ప్రభాతవార్త క్రిస్మస్ సందర్భంగా కల్లూరు బీసీ కాలనీలోని క్రైస్ట్ చర్చి నందు క్రిస్మస్ ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిని ముందుగానే విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. భక్తులందరూ ఉదయం 10 గంటలకల్లా చర్చి నందు యేసుక్రీస్తు ప్రభువుల వారిని ఆరాధించారు.భక్తాదులందరూ దేవుని స్తుతించారు. పాస్టర్ ధనరాజ్ యేసుక్రీస్తు గురించి బోధించారు. వస్త్రాలు పంపిణీ పాస్టర్ ధనరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 1000 మంది పాల్గొన్నారు. సుశీల, టైటస్, రీన, రాజేష్, నరసింహులు, ప్రభావతి, విమలమ్మ, సురేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి కోదండ రామయ్య, చెంగల్ రాయులు, సత్యవతమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఘనంగా హనుమాన్ చాలీసా యజ్ఞ భజనలు



కాణిపాకం, డిసెంబర్ 25 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో బుధవారం శ్రీహనుమాన్ చాలీసా యజ్ఞ భజన గానామృతం కార్యక్రమంనుఅత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామాంజనేయ నామ సంకీర్తన భజన మండలి ఉదయ్ కుమార్ శర్మ భాగవతార్ చెన్నై, చిత్తూరు జిల్లా హనుమాన్ భక్తుల వారిచే స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం నుండి సాయంత్రం వరకు హనుమాన్ చాలీసా భజన బృందంచే హనుమాన్ చాలీసా మహా యజ్ఞ భజన గానామృతం కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా 108 హనుమాన్ చాలీసా సంకీర్తనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచ కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గణనాథుని దర్శించుకున్న ముంబాయి హైకోర్టు జడ్జి



కాణిపాకం, డిసెంబర్ 25 ప్రభాతవార్త: ముంబాయి హైకోర్టు జడ్జి జస్టిక్ శ్యామ్ సి చందక్ బుధవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబులతో పాటు ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

తవణంపల్లె, డిసెంబర్ 25 ప్రభాతవార్త:

ఏసుక్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండుగ పర్వదినాన్ని బుధవారం మండలంలోని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. అరగొండ కొత్తబస్టాండు సమీపంలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో పాస్టర్ గాబ్రియేల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించి ఏసు ప్రభోదాలను వివరించారు. మండలంలోని అరగొండ, ఎగువమత్యం, దిగువమత్యం, తడకర, తవణంపల్లె, ఐరాల క్రాస్, కొండ్రాజుకాల్వ, స్వస్తిక్‌నగర్, వీర్లగుడిపల్లె, పత్రపల్లె, ఈచనేరి తదితర గ్రామాల్లోని సీఎస్ఐ, రోమన్ క్యాథలిక్ చర్చిలలో క్రైస్తవ సోదరులు మంగళవారం రాత్రి నుండే క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు.

## ఐరాలలో వైభవంగా క్రిస్‌మస్ వేడుకలు

ఐరాల, డిసెంబర్ 25 ప్రభాతవార్త: మండలంలో క్రిస్‌మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు బుధవారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈమేరకు మండలంలోని చిగరపల్లె, చినకాంపల్లె, ఐరాల, పాతపాళ్యం తదితర గ్రామాల్లోని సీఎస్ఐ, రోమన్ క్యాథలిక్ చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే చర్చిలలో ప్రత్యేకప్రార్థనలు, దీపారాధనలు చేయడంతో పాటు ఏసుక్రీస్తు జననం, మహిమలను పాస్టర్‌లు భక్తులకు వివరించారు.

## తవణంపల్లె మండల బిజెపీ అధ్యక్షురాలిగా రమాదేవి



తవణంపల్లె, డిసెంబర్ 25 ప్రభాతవార్త: మండల బిజెపీ అధ్యక్షురాలిగా దిగువమాఘంకు చెందిన వల్లేరు రమాదేవిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బిజెపీ జిల్లా ఉపాధ్యక్షుడు కెవి.చంద్రమోహన్, పూతలపట్టు నియోజకవర్గ పార్టీ కన్వీనర్ భాను ప్రకాష్‌ల ఆధ్వర్యంలో మండల కేంద్రం తవణంపల్లె పార్టీ కార్యాలయంలో మండల బిజెపీ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సోనె.బాలచంద్ర, అర్దగిరి ఆలయ మాజీ సభ్యుడు వినాయకం, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వి.మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు ఆనందబాబు, డిల్లీ ప్రసాద్, శ్రీనివాసులులతో పాటు మండల క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.

## ఐరాల మండల బిజెపీ అధ్యక్షుడిగా సునీల్‌కుమార్ ఆచ్చారి

ఐరాల, డిసెంబర్ 25 ప్రభాతవార్త:

ఐరాల మండల బిజెపీ అధ్యక్షుడిగా మద్దిపట్లపల్లెకు చెందిన సునీల్ కుమార్ ఆచ్చారిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బిజెపీపూతలపట్టు నియోజకవర్గ పార్టీ కన్వీనర్ భానుప్రకాష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మండల బిజెపీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ మోర్చా కార్యదర్శి ఆదినారాయణ, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ఓబీసీ ఉపాధ్యక్షుడు మునీంద్రాచ్చారి, తాజా మాజీ అధ్యక్షుడు కుమార్, నాయకులు పరదేశి, ప్రకాష్, అశోక్‌కుమార్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు



బంగారుపాళ్యం, డిసెంబర్ 25 ప్రభాతవార్త: ఏసు ప్రభువు జన్మదినంను పురస్కరించుకుని బుధవారం మండల ప్రజలు ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకున్నారు. మండలంలోని అన్ని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అర్ధరాత్రి నుండి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలను పాస్టర్లు నిర్వహించారు. మండలంలోని బంగారుపాళ్యం, ముంగరమడుగు, రాగిమానుపెంట, తగ్గువారిపల్లి, నల్లంగాడు కోటూరు, తుంబపాళ్యం, కరిడివారిపల్లి, పెరుమాళ్ళపల్లి, తుంబకుప్పం తదితర గ్రామాల్లో క్రైస్తవులు ఘనంగా క్రిస్మస్ పండుగను జరుపుకున్నారు. తగ్గువారిపల్లి కార్నర్ స్టోన్ చర్చి నందు పేదలకు అన్నదానం, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు శ్యాము, జాన్‌మేరీ, దివ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే బంగారుపాళ్యం సిఎస్ఐ చర్చి నందు పేదలకు వస్త్రదానం చేపట్టారు. ఇందులో రోప్ సంస్థ డైరెక్టర్లు గుణశేఖర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధానమంత్రి వాజపేయి జయంతి



వేదురుకుప్పం, డిసెంబర్ 25ప్రభాతవార్త : భారత మాజీ ప్రధాన మంత్రి అటల్ బీహారి వాజపేయి జయంతి వేడుకలు బుధవారం ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి ఆధ్వర్యంలలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయితీ పరిధిలో వాజపేయి చిత్రపటంకు పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించి కేక్ కత్తరించి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల భారతీయ జనత పార్టీ అధ్యక్షులు విశ్వనాథ రెడ్డి, 78 బూత్ అధ్యక్షులు మురళి, నాయకులు వాసు, భాస్కర్, చిన్నబ్బ తదితరులు పాల్గొన్నారు.

## పేద క్రైస్తవులకు బిసిఎన్ ట్రస్ట్‌చే నిత్యావసరాలు పంపిణీ

కుప్పం, డిసెంబర్ 25 ప్రభాతవార్త



నిరుపేద క్రైస్తవులు క్రిస్మస్ పండగను సుఖసంతోషాలతో జరుపుకునేందుకు కుప్పం బిసిఎస్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ తనవంతుగా చేయూత అందించారు. క్రిస్మస్ సందర్భంగా స్థానిక షాలోమ్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా నిరుపేద క్రైస్తవులకు బిసిఎన్ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ మాట్లాడుతూ ఉత్తమ మార్కులు పొందే పేద విద్యార్థులకు తమ విద్యాసంస్థల్లో ఆర్థికసాయం అందించి వారి ఉన్నత విద్యకు తోడుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చర్చిఫాస్టర్ సుబ్రమణ్యం, పార్తిబన్‌లు బిసి నాగరాజ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బిసిఎస్ ట్రస్ట్ సభ్యులు డా॥ సునీల్ రాజ్, సాగర్ రాజ్ పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ పండగ వేడుకలు..ప్రత్యేక ప్రార్థనలు



కుప్పం, డిసెంబర్ 25 ప్రభాతవార్త క్రైస్తవ సోదరులు అతి ముఖ్యమైన క్రిస్మస్ పండగను బుధవారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఉదయం నుంచే కుప్పం పట్టణంతో పాటు బాబునగర్, చిన్నకురబలపల్లి, కొత్తపేట, గుట్టపల్లి, గుడ్లనాయనపల్లి గ్రామాల్లోని చర్చిలతో పాటు మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చర్చిలలో ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ప్రభుత్వ విప్, ఎమ్మె ల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంలు వివిధ చర్చిలకు వెళ్లి క్రైస్తవ సోదరు లకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేత గోపీనాథ్, నేతలు సత్యేంద్రశేఖర్, ప్రతాప్, అప్పు, మగి, ఐటిడిపి నరేష్, ఇరా ఫ్రెన్ తదితరులు పాల్గొన్నారు.

**శాంతిపురం :** మండలంలో క్రిస్మస్ పండగను ఘనంగా జరుపుకున్నారు. గాడ్స్ కింగ్‌డమ్ గాస్పెల్ మినిస్ట్రీ వారి శాంతిపురం, పిఇఎస్ చర్చిలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఫాస్టర్ చింతల స్వామిదాస్, సిస్టర్ నయోమి, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

**రామకుప్పం:**మండలంలో క్రిస్మస్ పండగను క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. బళ్ల, గెరిగపల్లి, వీర్నమల, రామకుప్పంలోని ఆర్‌సిఎం చర్చి, హోలీ ఫ్యామిలీ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిఫాదర్లుబైబిల్‌ప్రవచనాలనువివరించారు.పిల్లలకుఆటలపోటీలునిర్వహించి బహుమతులు అందించారు.

## ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పాయి జన్మదిన వేడుకలు



కుప్పం, డిసెంబర్ 25 ప్రభాతవార్త దివంగత మాజీ ప్రధాని వాజ్‌పాయి జన్మదిన వేడుకలను కుప్పం బధిర పాఠశాలలో శ్రీ సద్గురు యోగి నారాయణ బలిజ సేవా ట్రస్ట్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బిజెపి సీనియర్ నేత ప్రభాకర్ సహకారంతో విద్యార్థులకుపుస్తకాలు, పెన్నులు, సోపులు, పేస్టు, మిఠాయిలు పంచారు. బధిర పాఠశాల సిబ్బందికి దుస్తులు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి సీనియర్ నేత గోపీనాథ్, బిజెపి నేతలు న్యాయవాదులు వెంకటపతి, కెవి ప్రసాద్, నేతలు కె.కన్నన్, విసి మంజునాథ్,బిజెరామకృష్ణ, శివశంకర్, వెంకటరమణబాబు, రాజేంద్ర, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

**శాంతిపురం:** మాజీ ప్రధాని వాజ్‌పాయి జయంతిని శాంతిపురంలో ఎన్డీయే కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వాజ్‌పాయి చిత్రపటానికి పూజు నిర్వహించి నివాళులు అర్పించారు. మండల బిజెపి అధ్యక్షుడు కాశీనాథ్, నేతలు గజేంద్ర, శివ, టిడిపి నేత రాజు పాల్గొన్నారు.

**రామకుప్పం :** మాజీ ప్రధాని దివంగత వాజపాయి జన్మదిన వేడుకలను రామకుప్పంలో బిజెపి నేతలు ఘనంగా జరిపారు. వాజ్‌పాయి చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా నేతలు రాజసింహా, ఆంజనేయులు, గజేంద్రరెడ్డి, వెంకటేష్, నాగరాజు, ఆనంద్, కార్తీక్, అప్పస్వామి, లోకనాథరెడ్డి, జనార్ధనరెడ్డి, మణికంఠ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో విద్యార్థి మృతి చెందడం బాధాకరం



శాంతిపురం, డిసెంబర్ 25 ప్రభాతవార్త మండలంలోని గుండిశెట్టిపల్లి గ్రామానికి చెందిన మహేంద్ర అనే ఇంటర్ విద్యార్థి విద్యుత్‌షాక్‌తో మృతి చెందడం బాధాకరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా.కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం వారు గుండి శెట్టిపల్లికి చేరుకుని మహేంద్ర మృతదేహానికి నివాళులు అర్పిం చారు. బాధిత కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాన్ని ఆదుకుంటా మని వారు పేర్కొన్నారు.తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ, ఐటిడిపి రవి, బాలు పాల్గొన్నారు.

## ముమ్మరంగా తెదేపా సభ్యత్వ నమోదు

కుప్పం, డిసెంబర్ 25 ప్రభాతవార్త కుప్పం మున్సిపల్ పరిధి 16,17,18 వార్డుల్లో బుధవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెదేపా నేతలు చేపట్టారు. ఈసందర్భంగా పలువురు మహిళలు స్వచ్చందంగా ముందుకు వచ్చి వంద రూపాయలు చెల్లించి సభ్యత్వాలు పొందారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయ్ జయంతి వేడుకలు



చిత్తూరురూరల్, డిసెంబరు 25 ప్రభాతవార్త: చిత్తూరుపట్టణం గాంధీ విగ్రహం ఎదుట ఆదివారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ 100వ జన్మదిన వేడుకలను సెంట్రల్ మండల అధ్యక్షులు షణ్ముగం ఆద్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిననంతరం మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని దేశంలోని అతిపెద్ద పార్టీలలో ఒకటిగా తీర్చిదిద్దారని కొనియాడుతూ నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి దుర్గారామక్రిష్ణ, అట్లూరిశ్రీనివాసులు, రామభద్ర, రవికుమార్, సురేష్, గోకుల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పలమనేరు,డిసెంబర్ 25,ప్రభాతవార్త:



పలమనేరు పట్టణంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు.స్థానిక ఆర్టీసి బస్టాండ్ వద్ద ఉన్న సిఎస్ఐ చర్చ్,గుడియాత్తంరోడ్డులో నూతనంగా నిర్మించిన సిఎస్ఐ చర్చలతో పాటు పలు చర్చలలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొన్నారు.ఈ మేరకు జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో ఆయన పాల్గొని వారికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి,రాష్ట్ర కురబ కార్పోరేషన్ డైరెక్టర్ సుబ్రమణ్యం గౌడ్,వి.కోటమండలఅధ్యక్షులురంగనాథ్,రాంబాబు,ఆర్‌బిసికుట్టి,గిరిబాబు,ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## ఎయిమ్స్ ప్రవేశ పరీక్షలో 38 ర్యాంకు సాధించిన హర్షిత

పలమనేరు, డిసెంబర్ 25 ప్రభాతవార్త: ప్రతిష్టాత్మక ఆల్ ఇండియా ఎయిమ్స్ నిర్వహించిన పి.జి ప్రవేశ పరీక్షలలో పలమనేరుకు చెందిన డా.హర్షిత 38 ర్యాంకు సాధించారు. గత నెల 10న ఎయిమ్స్ పి.జి ప్రవేశ పరీక్షలను నిర్వహించారు. పలమనేరుకు చెందిన డా.సావిత్రి,డా.సుబ్రమణ్యం కుమార్తె డా.హర్షిత కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసి ఎయిమ్స్ పి.జి ప్రవేశ పరీక్ష రాయడం జరిగింది. ఇటీవల వారు విడుదల చేసిన పలితాలలో డా.హర్షిత 38వ ర్యాంకు సాధించి పి.జి.ఐ.ఎం.ఇ.ఆర్ చండీగర్‌లోజనరల్‌మెడిసిన్‌సీటుసాధించారు.ఈ సందర్భంగా స్థానిక వైద్యులు, ప్రజలు ఆమెను అభినందించారు.

## పాకలో జన్మించిన బాలుడు లోక రక్షకుడయ్యాడు



చౌడేపల్లి, డిసెంబర్ 25 ప్రభాతవార్త పశువుల పాకలో జన్మించిన బాలుడు లోక రక్షకుడయ్యాడని క్రైస్తవమత పెద్దలు కొనియాడారు. జీసస్ జన్మదినం(క్రిస్‌మస్) వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సిఎస్ఐ చర్చినందు ఫాస్టర్ నోయల్ భరత్‌కుమార్, సంఘ కోశాధికారి ప్రసాద్‌బాబు, ఇమారియా, క్రీస్తుపరిమళ, లద్దిగం లాజర్, షికారిపాళెం, పక్షిరాజపురం తదితర చర్చిలందు ఉదయాన్నే క్రిస్టియన్ సోదరులు చేరుకొని ప్రార్థనలు చేసారు. ఆయా చర్చిల వద్ద వివిధ వేషధారణలతో చూపరులను అలరించారు.

## బిజెపి మండలాధ్యక్షుడుగా కడియాల మనోహర్ రాయల్



చౌడేపల్లి, డిసెంబర్ 25 ప్రభాతవార్త బిజెపి మండలాధ్యక్షుడుగా పరికిదొనకు చెందిన కడియాల మనోహర్ రాయల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. దివంగత ప్రధాన మంత్రి అటల్ బిహార్ వాజ్‌పాయ్ జయంతిని పురస్కరించుకొని స్థానికంగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గ కన్వీనర్ మదన్‌మోహన్ ఆధ్వర్యంలో మనోహర్‌ను ఏకగ్రావం చేసినట్లు ఎన్నికల అధికారి డిష్ రాజారెడ్డి ప్రకటించారు. బిజెపి నాయకులు గాలి ప్రవీణ్‌నాయుడు, మాదాస్ లోకేష్, గందోడి ప్రవీణ్, రత్నయ్య, శేఖర్‌బాబు, రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ

చౌడేపల్లి, డిసెంబర్ 25 ప్రభాతవార్త



యేసుక్రిస్తు జన్మదినం(క్రిస్‌మస్)ను పురస్కరించుకొని చిత్రెడ్డిపల్లికి చెందిన వసంతపల్లి వెంకట్రమణ ఆయన సతీమణి శాంతమ్మ, కోడళ్ళు, కుమారులు పేదలకు అన్నదానం, దుప్పట్లను పంపిణీ చేసారు. యేటా క్రిస్మస్‌ను పురష్కరించుకొని సామాజిక సేవల్లో భాగంగా వెంకట్రమణ కుటుంబ సభ్యులు పేదలకు 16యేళ్ళుగా సాయం చేస్తున్నారు. ప్రముఖ గణితశాస్త్ర మాస్టారు శ్రీనివాసులు, పూల రెడ్డెమ్మ, స్థానికులు పాల్గొన్నారు.

## బిజెపి అధ్యక్షుడిగా జల్లా జ్యోతిరెడ్డి

శ్రీరంగరాజపురం, డిసెంబర్ 25 ప్రభాతవార్త:

శ్రీరంగరాజపురం మండల బిజెపి అధ్యక్షుడిగా జల్లా జ్యోతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బిజెపి సంస్థాగత పార్టీ నిర్మాణంలో భాగంగా బుధవారం పార్టీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జెకె చౌదరి, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాజేంద్రన్ ఆధ్వర్యంలో జల్లా జ్యోతిరెడ్డిని మండల బిజెపి పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జల్లా జ్యోతిరెడ్డి వరుసగా మూడవ సారి మండల బిజెపి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.మండల పార్టీ బూత్ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగుదేశం శాశ్వత సభ్యత్వం తీసుకున్న షణ్ముగం

చిత్తూరు, డిసెంబర్ 25 ప్రభాతవార్త:

మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పి.షణ్ముగం బుధవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు చేతుల మీదుగా రూ. ఒక లక్ష రూపాయలు చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా పి.షణ్ముగం మాట్లాడుతూ తెలుగుదేశం సభ్యత్వ సమోదు దూసుకు వెళ్తుందని, ఇప్పటికే 80 లక్షల మంది సభ్యత్వం తీసుకోవడం జరిగిందన్నారు. సమాజంలోని యువతఎక్కువగాతెలుగుదేశంపార్టీసభ్యత్వం తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పాలసముద్రం, డిసెంబర్ 25 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలో బుధవారం క్రిస్మస్ పండుగ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని క్రైస్తవులు బుధవారం వేకువజామున చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ క్రీస్తు నామంను స్మరించారు. ఈ సందర్భంగా పాస్టర్లు క్రీస్తు జననంపై ప్రవచనాలు బోధించారు. ప్రజలు క్రీస్తు బాటలో పయనించి దేవుడి దీవెనలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం చర్చిల్లో భక్తి గీతాలు ఆలకించి కేక్‌లను కట్ చేసి అందరికి పంచి పెట్టారు. మండల వైకాపా అధ్యక్షుడు తులసీయాదవ్, జడ్పీటీసీ అన్బుగలన్‌లు మండల పరిధిలోని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# తిరుపతి డివిజన్

## యూరోకిడ్స్‌లో ఘనంగా మేరీ క్రిస్‌మస్ వేడుకలు

.శ్రీకాళహస్తి, డిసెంబర్ 25 ప్రభాతవార్త



విక్రమ్ విద్యాసంస్థల్లో భాగంగా యూరోకిడ్స్ స్కూల్‌లో మేరీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకు న్నారు. లోకరక్షకుడు ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచ వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలను జరుపుకోవడం ఎంతో సంతోషమన్నారు. ఈసందర్భంగా విక్రమ్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు పుట్టిన పవిత్ర రోజున క్రిస్మస్ పండుగను జరుపుకుంటామని తెలిపారు. ప్రతి విద్యార్థి మంచి నడవడిక, నైతిక విలువలు పెంపొందించుకోవా లన్నారు. అనంతరం చిన్నారులు శాంతాక్లాస్ మరియు వివిధ డ్రస్సులతో డ్యాన్సులతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మునిలక్ష్మి, హెచ్ఎం ఉమాదేవి మరియు ఉపాధ్యాయులు చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చంద్రప్ప సారధ్యంలో వాజ్‌పేయికి నివాళులు

.తొట్టంబేడు, డిసెంబర్ 25 ప్రభాతవార్త



మాజీ ప్రధాని కీర్తిశేషులు అటల్‌బీహారి వాజ్‌పేయి జన్మదిన వేడుకలను తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలోని 109వ పోలింగ్‌బూత్‌లో అధ్యక్షులు ప్రియాంక ఏర్పాటు చేసిన దివంగత మాజీ ప్రధాని అటల్‌బీహారీ వాజ్‌పేయి శతజయంతి కార్యక్రమాన్ని వార్డు సభ్యులతో కలసి ఏర్పాటు చేశారు. అనంతరం వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బూత్ అధ్యక్షులు అరుణ, గుత్తి త్యాగరాజు, నాని, జ్ఞానశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు తడిచెత్త పొడిచెత్త బుట్టలు పంపిణీ

.తొట్టంబేడు, డిసెంబర్ 25 ప్రభాతవార్త



క్లీన్ అండ్ గ్రీన్ శ్రీకాళహస్తి లక్ష్యంగా చర్య లు చేపడుతున్నా మని ఎంఎల్‌ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి వెల్లడించారు. శ్రీకాళహస్తిలో ఇంటింటికి చెత్తసేకరణ కోసం తడి చెత్త, పొడిచెత్త సేకరణకు ప్రత్యేక బుట్టలను ఎంఎల్ఏ ఆదేశాల మేరకు మండలంలోని కారాకొల్లు పంచాయతీలో మాజీ మార్కెట్‌క మిటీ ఛైర్మన్, తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకుడు వాడపల్లిజయచంద్రనాయుడు పంపిణీచేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రోజా, నీటి సంఘ అధ్యక్షుడు చెంగమనాయుడు, మాజీ సర్పంచ్ రమణయ్య, వనజమ్మ, రేఖ, నీరజ, బత్తెయ్య, శ్రీనివాసులు, మణి తదితరులు పాల్గొన్నారు.

## విషం తాగి యువతి మృతి

రేణిగుంట, డిసెంబర్ 25 ప్రభాతవార్త



రేణిగుంట మండలం తారక రామా నగర్ చెందిన రాజశ్రీ(22) విషం తాగి ఆత్మహత్యకు పాల్పడి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. అర్బన్ పోలీస్ స్టేషన్ రైటర్ గౌరీ నాయుడు కథనం మేరకు చెన్నై కు చెందిన సుమతి, సుబ్రహ్మణ్యం దంపతులకు రాజశ్రీ నాల్గవ సంతానం. ఆమెను రేణిగుంట మండలం తారకరామా నగర్‌లో కాపురం ఉంటున్న సుమతి అక్క జయమ్మ, నాగయ్య దంపతులకు మూడు నెలల వయసులో అప్పగించారు. అప్పటినుండి ఆమె వారి వద్ద పెరుగుతూ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు కళాశాలలో ఎంబీఏ చదివింది. చదువుతున్న సమయంలో తోటి విద్యార్థి హేమంత్ తో పరిచయమై అది కాస్త ప్రేమగా మారి పెళ్లి వరకు దారితీసింది. మే నెల 2022 సంవత్సరం నందు ఇద్దరు కలిసి వివాహం చేసుకుంటామని వెళ్లారు. విషయం తెలుసుకొని రాజశ్రీ తల్లి సుమతి తిరుచానూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. తిరుచానూరు పోలీసులు ఇద్దరినీ పిలిపించి పెళ్లి విషయం ప్రస్తావించగా ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చిన తర్వాత పెళ్లి చేసుకుంటామని చెప్పడం పెళ్లి చేసుకునే వరకు రాజశ్రీ హాస్టల్లో ఉండడానికి అంగీకరించింది. దీంతో ఆమె తల్లి రాజశ్రీ తో ఎలాంటి సంబంధం లేదని చెన్నైకు వెళ్ళిపోయింది.దాదాపు నెలరోజుల క్రితం రాజశ్రీ పెంపుడు తండ్రి నాగయ్యకు యాక్సిడెంట్ కావడంతో ఆయనను చూడడానికి హాస్టల్ నుండి రాజశ్రీ తారక రామా నగర్ కు వెళ్ళింది. డిసెంబర్ నెల రెండో తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాజశ్రీ విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే నాగయ్య కుటుంబం ఆమెను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న ఆమెను చూడడానికి తల్లి సుమతి చెన్నై నుండి ఆసుపత్రికి వచ్చింది. కుటుంబ సభ్యులు దూరమైనందువల్ల జీవితంపై విరక్తి చెంది విషం తీసుకున్నట్టు తల్లికి చెప్పింది. బుధవారం చికిత్స పొందుతూ రాజశ్రీ మృతి చెందింది. తల్లి సుమతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ శరత్ చంద్ర ఆదేశాలతో అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## పాకాల వంకపై ప్రొటెక్షన్ వాల్ ఏర్పాటు చేయండి

పాకాల, డిసెంబర్ 25, ప్రభాతవార్త



పాకాల నుంచి దామలచెరువు వైపు వెళ్లే రోడ్డులో పాకాల వంకపై రోడ్డుకి ఇరువైపుల సేఫ్టీ వాల్ నిర్మించాలని పెద్ద ఎత్తున వాహనదారుల నుంచి విజ్ఞప్తులు అందుతున్నాయి. ఇటీవల కాలంలో ఎగువ పడిన వర్షానికి పైన వున్న చెరువులు పూర్తి స్థాయిలో నిండి పాకాల వంలో ప్రవాహం పెరిగటంతో నీరు రోడ్డుపై ఒకటిన్నర అడుగు ఎత్తు ప్రవహించడం వలన వాహనదారులు ప్రవాహాన్ని దాటే ప్రయత్నంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ పరిస్థితిని గమనించి పాకాలకు వచ్చి, వెళ్లే రోడ్డుకు ఇరువైపులా వెంటనే సేఫ్టీ వాల్ నిర్మాణం చేయవలసినదిగా సంబంధిత అధికారులను వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

## క్రిస్మస్‌వేడుకలలో దేశం ఇన్‌చార్జి చల్లాబాబు

పుంగనూరు,డిసెంబరు 25 ప్రభాతవార్త



నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి చల్లారామ చంద్రారెడ్డి బుధవారం పట్టణంలో క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్నారు. పట్టణంలోని కొత్తఇండ్లులో దేశం నాయకుడు గిరిబాబు ఇంటిలో నిర్వహించిన క్రిస్మస్ సంబరాలకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మతపెద్దలు పండుగ సందేశాన్ని అందచేశారు. కార్యక్ర మంలోపార్టీనాయకులు సివిరెడ్డి, మాధవరెడ్డి, రామకృష్ణమరాజు,న్యాయవాది వెంకటమునియాదవ్, సయ్యద్ సుహేల్‌బాషాతదితరులుపాల్గొన్నారు. ఈసందర్భంగా గిరి ఇంటి వద్ద పార్టీనాయకులు,కార్యకర్తలు,ప్రజలకు విందు ఏర్పాటుచేశారు.

## అనాథలకు ప్రేరణ హెల్పింగ్ సొసైటీ వారిచే అల్పాహారం పంపిణీ

తిరుపతి విద్య డిసెంబర్ 25 ప్రభాత వార్త:

స్థానిక బైరాగిపట్టెడలోని మాతృస్య ఫౌండేషన్ (అనాథ ఆశ్రమం) మరియు తిరుచానూరు లోని నవజీవం బ్లయిండ్ రిలీఫ్ సెంటర్ నందు అనాథలకు ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం అల్పాహారం పంపిణీ చేశారు.శాంతా క్లాస్ తో వెళ్లి అక్కడి పిల్లలని అలరించి కేక్స్ పంచి పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో ప్రేరణ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే,ఈ ఏడాది కూడా ప్రేరణ హెల్పింగ్ సొసైటీ క్రిస్మస్ వేడుకలను ఆత్మీయంగా జరుపుకోవడం సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేరణ టీం మెంబెర్స్,వాలంటీర్స్, మరియు దాతలు పాల్గొన్నారు.

## అనుమతి లేని భవన నిర్మాణానికి కార్యదర్శి నోటీసు

తిరుపతిరూరల్,డిసెంబర్ 25 ప్రభాతవార్త:



జీ+2కి పంచాయతీ అనుమతి తీసుకుని...నిబంధలకు విరుద్దంగా ఏకంగా 6అంతస్తులు నిర్మించిన భవన నిర్మాణానికి పంచాయతీ కార్య ధర్శి నోటీసులు అంటించింది. ఇదేక్కోడో మారుమూల అంటే పోర పాటే...తిరుపతిరూరల్ వేదాంతపురం గ్రామ సచివాలయానికి ఎదురు గానే నిర్మితమైతున్న పంచాయతీ కార్యధర్శి ఇదివరకు ఎలాంటి నోటీసు జారీ చేయలేదని విషయం తెలుస్తుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక, పంచాయతీ కార్యధర్శిగా వచ్చిన మునీశ్వరి నిబంధనలకు విరుద్దంగా నిర్మిస్తున్న 6అంతస్తుల భవనానికి నోటీసులు అంటించారు. భవన నిర్మాణ్మాకి పంచాయతీ అప్రూవల్ జీ+2కు తీసుకుని, తుడ అప్రూవల్ లేకుండా నిబంధనలకు విరుద్దంగా నిర్మిస్తున్న భవనం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎంఎస్ఎంఇల ద్వారా మెరుగైన సేవలు

తిరుపతి,డిసెంబర్ 25ప్రభాతవార్త:

శ్రీరామ్‌గ్రూప్‌లోని శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ ఎంఎస్ఎంఇల ద్వారా గణనీయమైన అభివృద్ధి సాధించి, వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్నట్లు సంయుక్త ఎండి కె. శ్రీనివాస్ తెలిపారు. ఎంఎస్ఎంఇలు సహాయక పర్యావరణ వ్యవస్థను నిర్మించడంద్వారా తెలుగురాష్ట్రాల్లో ఆర్థిక వృద్ధికి సులభమైందన్నారు. వినియోగదారులకు సంతృప్తికర సేవలు, కార్యాచరణ నైపుణ్యం, వ్యూహాత్మక భాగస్వాములపై దృష్టి సారించి స్థిరమైన వృద్ధి సాధిస్తుందన్నారు. పట్టణాల్లోనేగాక గ్రామీణ ప్రాంతాల్లో కూడా శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ 1,683 శాఖలతో సేవలు అందిస్తోందన్నారు. గ్రామీణులకు ఆర్థిక చేయూత ప్రోత్సహించడంలో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో 158 శాఖలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయన్నారు. మూడు ప్రధానరంగాల్లో ఎంఎస్ఎంఇవిస్తరించిందన్నారు.

## వైభవంగా మామండూరు జాతర వేడుకలు

చంద్రగిరి, డిశంబర్ 25 ప్రభాతవార్త:



మండల పరిధిలోని మామండూలో మంగళవారం, బుధవారం రెండు రోజులు జాతర వేడుకలు వైభవంగా జరిగాయి. మామండూరు జాతర వేడుకలకు హాజరైన ఎంఎల్ఏ పులివర్తి నానికి పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. జాతర వేడుకలను పురస్కరించుకుని గ్రామ నడిబొడ్డున పచ్చని పందిరి క్రింద కొలువుదీరిన గంగమ్మ వారి విగ్రహాన్ని పసుపు కుంకు మలతో సుగంధభరిత పుష్పాలతో విశేషంగా అలంకరిం చారు. బుధవారం ఉదయం మహిళలు, యువతులు సంప్రదాయ వస్త్రధారణలతో జాతర వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. జాతర వేడుకలను పురస్కరించుకుని గ్రామంలో సుబ్రమణ్యం నాయుడు, కోదండ నాయుడు, పలువురు నాయకులు అతిధులకు ఆతిథ్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు డాలర్స్ దివాకర్ రెడ్డి, నరశింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు,రమేష్ రెడ్డి, గౌస్‌భాషా, ఏజి పల్లి బాల, ఇందుశేఖర్ నాయుడు, హేమాంబరధర రావు, లోకాద్రి నాయుడు, పులి కంటి మోహన్ రెడ్డి, శానంబట్ల తులసి రెడ్డి, చిరంజీవి, కన్నయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పాయ్ జయంతి వేడుకలు

చంద్రగిరి, డిశంబర్ 25 ప్రభాతవార్త:



మాజీ ప్రదాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ శత జయంతి వేడుకలు బుధవారం చంద్రగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ప్రదాన కార్యదర్శి కె.వెంకటముని మాట్లాడుతూ గ్రామీణ సడక్ యోజన, జాతీయ ఉపాధిహామీ పధకం వంటి అనేక పధకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. ఈ కార్యకమంలో బిజెపి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.సుబ్రమణ్యం యాదవ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సునీల్ యాదవ్, సీనియర్ నాయకులు సక్కూర్ మునిగంగిరెడ్డి, మండల ప్రదాన కార్యదర్శి నరేష్‌కుమార్ నాయుడు, ఇందుశేఖర్, టివి ప్రసాద్, హనుమంత నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ప్రతిభ

తిరుపతి విద్య డిసెంబర్ 25 ప్రభాత వార్త:



జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భ ంగా కన్స్యూమర్ అఫైర్స్,ఫుడ్ అండ్ సివిల్ సప్లయ్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాస రచన (తెలుగు) పోటీలలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల బీఏ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి టి రాజేష్ కు తృతీయ బహుమతి గెలుచుకున్నారు.ప్రశంసాపత్రం రూ.3000/- నగదు అందుకున్న విద్యార్థి రాజేష్ ను బుధవారం కళాశాలలో టీటీడీ డీఈఓ డాక్టర్ నాగరాజు,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి,వైస్‌ప్రిన్సిపాల్‌భాస్కరుడు,కామర్స్ విభాగధిపతి డాక్టర్ మల్లికార్జున, అధ్యాపకులు అభినందించారు.

## ఏసు ప్రభువు మార్గం ఆదర్శనీయం : విజయ్‌బాబు

పుత్తూరు, డిసెంబరు 25 ప్రభాతవార్త :



ఏసు ప్రభువు అనుస రించిన ప్రేమ మార్గం ప్రపంచ మానవాళికి ఆదర్శనీయమని తెలు గు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు అన్నారు. బుధవారం ఎంబి రోడ్డులోని తన కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టి, క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసెస్ చూపించిన మార్గంలో ప్రజలంతా ప్రేమ, శాంతి, సామరస్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరమేశ్వరమంగళం ఎంపిటిసి శ్రీజ బాలాజీనాయుడు, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి రవినాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.ధనపాల్, టిడిపి మహిళా విభాగం నగరి నియోజకవర్గ కార్యదర్శి నాగరత్నం, ఇంకా నాయకులు దాసరి విజయ్‌చౌదరి, పాండురంగయ్య, మణికంఠ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## లూథరన్‌చర్చిలో ఘనంగా క్రిస్‌మస్ వేడుకలు

*తొట్టంబేడు, డిసెంబర్ 25 ప్రభాతవార్త*




పపంచ వ్యాప్తంగా జరిగే పండుగల్లో క్రిస్మస్ పండుగ ఎంతో ముఖ్యమైంది. పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణం సర్వమత సమ్మేళనాలకు నిలయం. ఏపండుగ వచ్చినా సరే కులమతాలతో సంబందం లేకుండా చేసుకుంటారు. ఈనేపధ్యంలో క్రిస్మస్ పండుగ సందర్బంగా స్థానిక కాసాగార్డెన్ సమీపంలో ఉన్న పురాతన లూథరన్ చర్చిలో ఫాస్టర్ రెవ.ఎం.మైకె ల్‌బాబు ఆధ్వర్యంలో అడకమిక్ కమిటీ రికార్డింగ్ కార్యదర్శి ఎస్.సతీష్ కుమార్, ఫైనాన్స్ కార్యదర్శి పి.మోహన్ సుందరం, సభ్యులు సి.రవికుమార్, ఎ.డేవిడ్‌ఆధ్వర్యంలో చర్చిని విద్యుత్ వెలుగుల్లో అద్భుతంగా అలంకరణ చేపట్టారు. అనంతరం ఫాస్టర్ రెవ.మైకెల్‌బాబు ఆధ్వర్యంలో క్రిస్మస్ ట్రీని వెలిగించి వేడుకలను ప్రారంభించారు. చర్చిలో ఉదయం 11గంటల నుంచి చర్చిలో ప్రత్యేక ప్రార్దనలు చేపట్టారు. అనంతరం నిరుపేదలకు దుప్పట్లు, చీరలును అందించారు.

***రామచంద్రాపురం గ్రామంలో..***

క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరి జీవితానికి ఆదర్శమని చర్చిఫాస్టర్ ఏలుమలై అన్నారు. బుధవారం క్రిస్మస్ సందర్బంగా మండలంలోని రామచంద్రాపురం గ్రామంలోఉన్న చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా తయారుచేసిన కేక్‌ను కట్‌చేసి చర్చిలోఉన్న చిన్నారులకు, క్రైస్తవసోదరులకు పంచిపెట్టారు. అనంతరం నిరుపేద మహిళలకుచీరలు పంపిణీచేశారు. మధర్‌థెరిస్సా స్వచ్చందసేవాసంస్థ అధ్యక్షురాలు మేరీచంద్రమ్మ, చర్చిసభ్యులు, క్రైస్తవసోదరులు పాల్గొన్నారు.

***బసవయ్యపాళెం చర్చిలో..***

మండలంలోని బసవయ్యపాళెం గ్రామసమీపంలోని చెన్నై రోడ్డు సమీపంలో ఉన్న జెరూసలెం ప్రార్ధన మందిరంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా చర్చిలో నిర్వహిస్తున్న ప్రార్ధనల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని క్రైస్తవ సోదరసోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని రౌతుసూరమాల గ్రామసమీపంలోని క్రైస్తవమిట్టలోని చర్చిలోను, కాసరం చర్చి, బోనుపల్లి, తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్ధనలు చేపట్టారు.

## ఇష్టంలేని చదువు కష్టం చదువులేని జీవితం నష్టం



**తిరుపతి విద్య డిసెంబర్ 25 ప్రభాత వార్త:** స్థానిక లిటిల్ ఏంజెల్స్ హైస్కూలు 44వ వార్షికోత్సవ వేడుకలు మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టేబుల్ టెన్నిస్ ప్లేయర్ డా.నైనా జైస్వాల్,పాఠశాల అధినేత కె రాజు గోపాల్ రెడ్డి,డైరెక్టర్ డాక్టర్ కె ఆర్ శ్వేత రెడ్డి,జాయింట్ సెక్రటరీ యం శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.డాక్టర్ నైనా జైస్వాల్ మాట్లాడుతూ ఇష్టంలేని చదువు కష్టం చదువులేని జీవితం నష్టం రూపాయకన్నా గుణం గొప్పది.వేల్ల కన్నా వినయం గొప్పది. అన్నదానం ఆకలిని తీర్చుతుంది,విద్యాదానం అక్షర జ్ఞానాన్ని పెంచుతుంది. ముఖ్యముగా విద్యార్థులకు నిరంతర సాధన,గురువులు పట్ల గౌరవం కలిగి మీ ప్రగతికి మీరే సోపానాలు వేసుకోవాలని సూచిస్తూ విద్యార్థులలో,తల్లి దండ్రులలో ఉత్సాహన్ని నింపారు అని అన్నారు.ఈ సందర్భంగా పలు అకడమిక్ కాంపిటేటివ్ పరీక్షల్లో ప్రతిభ చూపిన పోగూరి వికాస్,హేమ స్వరూప్ విద్యార్థులకు ఔట్ స్టాండింగ్ ఫర్ఫార్మెన్స్ అవార్డును నైనా జైస్వాల్ అందించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అరవింద్ రెడ్డి,పాఠశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



***రేణిగుంట, డిసెంబర్ 25 ప్రభాతవార్త*** గుంటూరుకు చెందిన చైతన్య శ్రీనివాస్ తిరుపతి ఢీమార్ట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అన్నమయ్య జిల్లా కోడూరులో ఎయిర్టెల్ కంపెనీలో ఉద్యోగం కోసం హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. అతను వెళుతున్న వాహనం మామండూరు సమీపిస్తుండగా ప్రమాదం ఎలా జరిగిందో తెలియదు కానీ ప్రమాదం జరిగిన ప్రాంతంలో గుంతలు ఉండడం వల్ల గుంతలను తప్పించబోయి గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నదని కొందరు, అతను వెళుతున్న ద్విచక్ర వాహనం గుంతలో పడి ఎగరడం వల్ల ప్రమాదం జరిగిందని ప్రమాదం జరిగిన తీరును చూసిన మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదంలో అతని తలపై ఉన్న హెల్మెట్ దూరంగా ఎగిరిపడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ శరత్ చంద్ర తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని స్తంభించిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకుంటామని సీఐ శరత్ చంద్ర తెలిపారు.

## హసిత మృతదేహాన్ని అప్పగించిన పోలీసులు

రేణిగుంట, డిసెంబర్ 25 ప్రభాతవార్త

రేణిగుంట విఎం వీధిలో ఆత్మహత్య చేసుకున్న హసిత మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బుధవారం పోలీసులు తల్లితండ్రులకు అప్పగించారు. హసిత మంగళవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. ఆమె మృతదేహాన్ని సీఐ శరత్ చంద్ర ఆదేశాల మేరకు ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి ఆమెతండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మృతదేహాన్ని హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, కానిస్టేబుల్ శ్రీనివాసులు తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

## సాంస్కృతిక పోటీలకు మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపిక



**తిరుపతి విద్య డిసెంబర్ 25, ప్రభాతవార్త :** దక్షిణ భారత స్థాయి సాంస్క ృతిక విభాగం పోటీలకు శ్రీపద్మా వతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థినిలు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం టీటీడీ విద్యాశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అభినందించారు. ఆయన మాట్లాడుతూ శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం అంతర కళాశాల పోటీలలో ఉత్తమ ప్రతిభతో గెలుపొందిన విద్యార్థులు దక్షిణ భారత స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వీరు చెన్నైలో త్వరలో జరగబోయేటువంటి పాల్గొనడం సంతోషకరమన్నారు. ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్.భద్రమణి మాట్లాడుతూ విద్యార్థినిలు చదువుతోపాటు సాంస్క ృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. వక్తృత్వ, థియేటర్ ఆర్ట్స్ విభాగంలో గెలుపొందిన విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని సాంస్క ృతిక విభాగం ఇంచార్జ్ నాగ పద్మ తెలియజేశారు. హాస్టల్ వార్డెన్ హేమలత, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్.విద్యుల్లత, డాక్టర్. కె.పి.పద్మజ, డాక్టర్.దివ్యవాణి, కల్చరల్ కో ఆర్డినేటర్ డాక్టర్. లక్ష్మి సంధ్య, కళాశాల అధ్యాపకులు విద్యార్థినిలు అభినందించిన వారిలో ఉన్నారు.

## దక్షిణాది సాంస్కృతిక పోటీలకు ఎస్వీయు విద్యార్థులు

తిరుపతి విద్య డిసెంబర్ 25, ప్రభాతవార్త :



దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల సాంస్క ృతిక పోటీలకు ఎస్వీయు విద్యార్థులు ఎంపికయ్యారని విసి అప్పారావు తెలిపారు. చెన్నైలో నిర్వహించే దక్షిణాది పోటీలకు డిఎస్ డబ్ల్యూ సిప) కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపికైన యువ కళాకారులను ఎంపిక బృందం బయలుదేరి వెళ్లారు. వీరికి ఎస్వీయూ విసి అప్పారావు, రిజిస్టర్ భూపతి నాయుడు మాట్లాడుతూ ఇటీవల యూనివర్సిటీలో నిర్వహించిన యువతరంగ్ పోటీలలో అద్భుతమైన ప్రదర్శన నిర్వహించి విజేతులగా నిలిచారన్నారు. వీరు దక్షిణాది అంతర్ కళాశాలల పోటీలలో మరిన్ని విజయాలు సాధించి యూనివర్సిటీకి పేరు తీసుకురావాలని ఆకాంక్షించి అభినందించారు.

## 27న పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా

తిరుపతి విద్య డిసెంబర్ 25, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్మెంట్ ఎక్చేంజ్, సీడేఫ్, డిఆర్డిఎ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 27న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్ లోకనాథం తెలిపారు. ఈ జాబ్ మేళా ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని, జాబ్ మేళాలో బహుళ జాతీయ సంస్థలు అరబిందో ఫార్మా, భార్గవి ఆటోమొబైల్స్ ,ఫోర్ట్ మేనేజ్మెంట్ సర్వీసెస్ తదితర సంస్థలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు పదో తరగతి లేదా ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, బీటెక్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతి యువకులు అర్హులుని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్హత సంబందించిన సర్టిఫికెట్స్ జిరాక్స్, బయోడేటా ఫామ్ తో పాటు క్రింద ఇచ్చిన రిజిస్ట్రేషన్ లింక్ లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. అడ్మిట్ కార్డుతో జాబ్ మేళాకు రావాలని ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ద్వారక నాథరెడ్డితెలియజేశారు.మరిన్నివివరాలకుఈక్రింది8143576866ఫోన్ నెంబర్ ను సంప్రదించాలన్నారు.

## ముగిసిన శిక్షణ తరగతులు



తిరుపతి విద్య డిసెంబర్ 25, ప్రభాతవార్త :

శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో డిసెంబర్ 16 నుంచి 25 వరకు పది రోజులు పాటు వెంకటపతి నగర్ లో మహిళలకు నిర్వహించిన బ్యూటీషియన్ శిక్షణ తరగతులు బుధవారం ముగిసాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు డాక్టర్ టి.చైతన్య హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో బ్యూటిషన్ కోర్సు కు ఎంతో ఆదరణ ఉందని, మహిళలు ఈ కోర్సు ను నేర్చుకుని తమదైన శైలిలో జీవితం కొనసాగించాలన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో బ్యూటిషన్ తో పాటు ఆర్య వర్క్, శారీ పెయింటింగ్, టైలరింగ్ వంటి కోర్సుల్లో కూడా శిక్షణను అందివ్వాలని మహిళలు కోరారు. అనంతరం మహిళలకు అవసరమైన బ్యూటిషన్ వస్తువులను ఉచితంగా అందజేశారు.కె నిరోష హాజరై బ్యూటీషియన్ పై మహిళలకు శిక్షణను ఇచ్చారు. అలాగే మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసిస్టెంట్ డాక్టర్ ఎం.ఇంద్రాణి సహాయ సహకారాలు అందించారు.

## 30నుండి అధ్యయనోత్సవాలు

తిరుమల,డిసెంబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:



ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11రోజుల ముందు దివ్యప్రబంధ అధ్యయనంగా పిలిచే అధ్యయనోత్స వాలు ఈనెల 30వతేదీ సోమ వారం నుండి మొదలవు తున్నాయి. రానున్నజనవరి 23వతేదీ వరకు అధ్యయ నోత్సవాలు వైభవంగా జరిపిస్తారు. స్వామివారి ప్రాశస్త్యంపై 12మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను శ్రీవైష్ణవ జీయంగార్లు గోష్టిగానం చేస్తారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4వేల పాశురాలను 25రోజుల పాటు తిరుమలేశుని ఆలయంలోపల రంగనాయకుల మండపంలో వైష్ణవులు పారాయణం చేస్తారు. తొలి 11రోజులు పగల్‌పత్తుఅని, మిగిలిన 10రోజులు రాపత్తుఅని వ్యవహరిస్తారు. 22వరోజున కణ్ణినున్ శిరుత్తాంబు,23వరోజు రామానుజ నూట్రందాది. 24వరోజులు స్వామివారి శాత్తుమొర, 25వరోజు అధ్యయనోత్స వాలు పూర్తవుతాయి.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్,డిసెంబర్ 25 ప్రభాతవార్త:



చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని తిరుపతిరూరల్, రామచంద్రాపురం మండలాలకు చెందిన బాధితులకు సుమారు రూ.21లక్ష 1488 రుపాయాల చెక్కులను ఎమ్మెల్యే పులివర్తి నాని అందజేసారు. బుధవారం రఘునాథ్ రిసార్ట్స్‌లోని పార్టీ కార్యాలయంలో 5మందికి చెక్కులను అందజేసారు. అనారోగ్యం, ఇతర సమస్యలతో బాధపడుతున్న 5మందిని గుర్తించి, ముఖ్యమంత్రి సహాయనిధిని కోరడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అప్రూవల్ పొంది, అర్హులకు సహాయనిధి అందినట్లు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## ఈ నిర్లక్ష్యం.. ఇంకెంత కాలం

పాకాల, డిసెంబర్ 25, ప్రభాతవార్త



పాకాల మండలం స్థానిక అంబేద్కర్ భవనం ముందు పెద్దకాలువ దగ్గర మెయిన్ రోడ్డు పై గత కొంత కాలంగా కాలువపై భారీ సిమెంట్ దిమ్మలు వదిలివేశారు. ఇటుగా వెళ్లే వాహనదారులకు దిమ్మెల వలన ప్రమాదం జరిగే అవకాశం వుంది. పాకాల పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి నిర్లక్ష్యంగా రోడ్డుపై వదిలేసిన సిమెంటు దిమ్మెలను అక్కడ నుంచి తొలగించాలి అని కోటకొండ త్యాగరాజులు స్థానికులు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు.

## పాకాలలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

**పాకాల, డిసెంబర్ 25, ప్రభాతవార్త** పాకాల మండలం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు బుధవారం రోజున ప్లాటినం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ వైద్య విశ్వవిద్యాలయం మరియు హాస్పిటల్ చిత్తూరు వారి సహాకారంతో డాక్టర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్, డాక్టర్ తులసి మొదలగు వైద్య బృందం ద్వారా 125 మంది వివిధ రకాల వ్యాధులను పరీక్షించి వారికి అవసరమైన ఆయుర్వేదిక్ మందులను ఉచితంగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పాకాల ప్లాటినం క్లబ్ అధ్యక్షులు తులసీరామన్, క్లబ్ మెంబర్లు మొదలైన వారు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

## పాకాలలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తుడు అరెస్టు



**పాకాల, డిసెంబర్ 25, ప్రభాతవార్త** పాకాల పోలీస్ స్టేషన్‌లో సి.ఐ మద్దయ్యాచారి మీడియా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాకాల సి.ఐ మద్దయ్యాచారి మాట్లాడుతూ పాకాల టౌన్ లో జరుగుతున్న వరస దొంగతనాల చేదన కొరకు జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాలతో చంద్రగిరి డి.ఎస్.పి బేతపూడి ప్రసాద్ సూచనల మేర నిఘా వ్యవస్థను బలోపేత పరిచి ఏర్పాటు చేశామని అన్నారు. 24వ తేదీ మంగళవారం సాయంత్రం 4:30 గంటల మధ్య పాకాల రైల్వే స్టేషన్ ముందర అనుమానితుడిగా తిరుగుతుండగా విచారించి అరెస్టు చేయడమైనదని తెలిపారు.ఇతను సి.పి.శ్రీనివాసులు(41), సన్నాఫ్ సి.పి. రాఘవయ్య, రామారావు కాలనీ, మదనపల్లి, అన్నమయ్య జిల్లాకు చెందిన వ్యక్తి అని తెలిపారు. చిత్తూరు, కదిరి, మదనపల్లిలలో గత పది సంవత్సరాల నుండి తప్పించుకుని తిరుగుతున్న పాత నేరస్తుడని పేర్కొన్నారు.గతంలో ఇతను పై కడప, చిత్తూరు, తిరుపతి, అనంతపూర్ జిల్లాల పరిధి పోలీస్ స్టేషన్‌లలో 20 కేసులు వరకు ఉన్నాయని తెలిపారు. పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఇతనిపై మూడు కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.ఇతని వద్ద నుండి 117 గ్రాముల బంగారు ఆవరణములు, 40 వేల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్ పంపించామని చెప్పారు. కరుడుగట్టిన నేరస్తుడిని చాకచక్యంగా హెడ్ కానిస్టేబుల్ విశ్వనాథ్, సోమశేఖర్, చలపతి,కానిస్టేబుల్ మునిశేఖర్ బాబు, విష్ణు ప్రసాద్‌లు పట్టుకున్నారు. వీరికి పాకాల సి.ఐ కె. మద్దయ్యాచారి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రవి, కులశేఖర్, సరస్వతి, గౌరీ శంకర్, తులసి, మహేష్, బుజ్జి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి రోజా



నగరి, డిసెంబరు 25 ప్రభాతవార్త: నగరి మున్సిపాలిటీ 9వ వార్డు నత్తంకండ్రిగలో వైసీపీ నాయకులు కృష్ణమూర్తి నివాసంలో మాజీ మంత్రి రోజా ఆయన కుటుంబ సభ్యులతో, బంధు మిత్రులతో, నగరి మున్సిపాలిటీ వైసీపీ నాయకులతో కలసి కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో నగరి మున్సిపాలిటీ వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా వాజ్‌పేయి జయంతి

నగరి, డిసెంబరు 25 ప్రభాతవార్త:



భారత మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్‌పేయి 100వ జయంతి వేడుకలను పట్టణ పరిధిలోని బీజేపీ కార్యాల యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకన్ని ఎగురవేసి వాజ్‌పేయికి నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గంలోని మండలాలకు నూతన అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. నగరి అర్బన్‌కు హరి, రూరల్‌కు జె.సతీష్, పుత్తూరు అర్బన్‌కు గిరి, రూరల్‌కు చెన్నకేశవులు, నింద్రకు రామ్‌ప్రసాద్, విజయపురంకు రాములును పార్టీ తరఫున ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిలకం ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయుడు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మునికృష్ణమనాయుడు, నాయకులు రామూర్తి, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని జయంతి వేడుకలు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 25 ప్రభాతవార్త** భారతదేశ ముద్దుబిడ్డ, భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్‌బీహారి వాజ్‌పేయి నూరవ జయంతి సందర్భంగా శ్రీకాళహస్తి పాతబస్టాండు సర్కిల్ వద్ద పార్టీ సీని యర్ నాయకులు గరికపాటిరమేష్‌బాబు ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు రాష్ట్ర బిజెపి నాయకులు కోలా ఆనంద్‌కుమార్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఇక్కడ వాజ్‌పేయి చిత్రపటానికి పూల మాలలు వేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా కోలా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ వ్యవస్థాపకులు అటల్జీ వారి జీవితాన్ని భారతదేశ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేశారన్నారు. అనంతరం నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జిల్లా కార్యదర్శి మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, ఎస్‌వి రమణ,ఢిల్లి కుమార్,లింగాబత్తిన గోపాల్,అమర్,సజ్జల హరీష్, భరత్‌నాయుడు,హరీష్‌రెడ్డి, జాజాల మురళి, ఈమిడిశెట్టి మోహన్, దక్కిలి శివ, నాగేషు, ఈదురు సురేష్, కొప్పల వాసు, సురేష్,నాని,సిద్దూ, సాయి,తులసి తదితరులు పాల్గొన్నారు.

## దాతలు ఆదుకోండి

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 25 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురానికి చెందిన ఓరైతు కుటుంబానికి చెందిన కుటుంబయజమాని ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని నిరుపేద అయిన ఆయన కుటుంబాన్ని ఆయన్ను బతికించటానికి దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని యువ సమాజ్ నిర్మాణ్ ఛారిటబుల్ ట్రస్టు పిలుపు నిచ్చింది.తొండమనాడుకు చెందిన ధనంజయరెడ్డిని ఏదో గుర్తుతె లియని వాహనం డీకొంది.ఆతన్ని తిరుపతిలోని రుయాకు తరలించగా అక్క డ ప్రయోజనం లేదని చెప్పటంతో మెరుగైన వైద్యం కోసం మారుతి రేమిడిలో చేర్చారని వివరించారు. తలకు బలమైన గాయం కావటం కడుపులో ప్రేగుకు రంధ్రం పడటం వల్ల డాక్టర్లు సర్జరీ చేయాలం టున్నారని ఆపరేషన్ ఖర్చులు మాత్రమే రూ. రెండు నుంచి 5లక్షలు అవుతుందని అంచనా వేసా రన్నా రు. అయితే కుటుంబమే గడవటం కష్టం ఉన్న పరిస్థితిలో దాతలు ఆదుకోవాలని పిలుపు నిచ్చారు. దాత లు ధనంజయరెడ్డి కుమారుడు ఆర్.వినోద్‌కుమార్ ఫోన్ నెంబర్ 9550062561కు పంపాలని కోరారు.

## పుత్తూరులో మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి వేడుకలు

పుత్తూరురూరల్, డిసెంబరు 25 ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ మాజీ ప్రధాని అటల్ బీహారి జయంతి వేడుకలు పుత్తూరు మండల కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీ కన్వీనర్ కె.ఎన్.హరిబాబు అధ్యక్షతన స్థానిక శివాలయం అన్నదాన కార్యక్రమం జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా రాష్ట్ర కార్యదర్శి చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏడు మండలాలు మండల ప్రెసిడెంట్‌లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి బాబు, ఆర్వో కైలాసం, పుత్తూరు మండలం అర్బన్ రోలర్ మండల అధ్యక్షులను పుత్తూరు అర్బన్ జై.గిరి ప్రసాద్, రూరల్ అధ్యక్షులుగా జి.చెన్నకేశవల్లి నూతనంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి బూతు స్థాయి కార్యకర్తలు, బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## వాడవాడలా క్రిస్మస్ వేడుకలు

పుత్తూరురూరల్, డిసెంబరు 25 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణం, మండలంలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని సెయింట్ మేరీ చర్చి, సీఎస్ఐ తూర్పు ప్రేమాలయం, సీఎస్ఐ పశ్చిమ ప్రేమాలయం, ఎల్ఈఎఫ్ చర్చి, వేపగుంటలోని నజరేతు లూథరన్ చర్చిలతో పాటు నియోజకవర్గంలోని చర్చిలు కొత్త రంగులతో అందంగా రూపొందించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని అన్ని చర్చిల్లో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ఆరాధన నిర్వహించారు.

## వైభవంగా క్రిస్మస్ వేడుకలు



**విజయపురం, డిసెంబరు 25 ప్రభాతవార్త:** మండలంలోని క్రైస్తవ చర్చిల్లో క్రిస్మస్ పురస్కరించుకుని బుధవారం మండలంలోని పన్నూరు సీఎస్ఐ చర్చిలో మహిళలకు చీరలు పంపిణీ చేసి క్రైస్తవ సోదరులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని మాధవరం, విజయపురంలో చర్చిల్లో ప్రార్థన నిర్వహించారు. మండలంలో క్రైస్తవ సోదరులు పండుగను వైభవంగా జరుపుకున్నారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలోని బూచివానత్తం, ఎల్ల సముద్రం, మంగళం, జీఎం పురం, ఇళ్ళత్తూరు, ఆలపాకం, కళియంబాకం గ్రామాల్లో చర్చిల్లో ప్రార్థనలు చేసి స్వీట్లు పంచి పెట్టారు.

## తడలో పలుచోట్ల క్రిస్మస్ వేడుకలు



తడ, డిసెంబర్ 25 ప్రభాతవార్త: తడ మండల పరిధిలోని పలు చర్చిలలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే పలువురు క్రిస్టియన్ సోదరులకు ఇతర మతాల వారు శుభాకాంక్షలు తెలియ జేశారు. స్థానిక సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో సురేంద్రపాల్ వాక్య సందేశాన్ని అందించగా, సంఘకాపరి జోయల్ వినీత్, ఛైర్మన్ జాన్ శశికుమార్, తడకండ్రిగ సర్పంచ్ తుమ్మ జయప్రద తదితరులు పాల్గొన్నారు. బాలఏసు పుణ్యక్షేత్రంలోను క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిపారు. అక్కడ ఫాదర్ ఆరోగ్యస్వామి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఇక్కడ అలంకరణలు పలువురిని ఆకట్టుకున్నాయి. తడ, తడకండ్రిగ పంచాయతీలతో పాటు ఇతర చోట్ల కూడా ఈ సారి క్రిస్మస్ వేడుకలు సంప్రదాయబద్ధంగా జరిపారు.

# గూడూరు డివిజన్

## వాజ్‌పేయి నిస్వార్థంగా పనిచేశారు

కోట, డిసెంబర్ 25 ప్రభాతవార్త: మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి భారతదేశ వైభవాన్ని, నైతిక విలువలను ప్రపంచానికి చాటారని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు అన్నారు. బుధవారం కోటలోని బిజెపి కార్యాలయంలో నిర్వహించిన వాజ్‌పేయి శతజయంతి వేడుకల్లో ఆయన పాల్గొని చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వాజ్‌పేయి పదవులకు ఆశపడకుండా నిస్వార్థంగా పనిచేశారని పేర్కొన్నారు. ఒక్క ఓటుతో అధికారం కోల్పోయినా ప్రజా తీర్పు కోరి మళ్లీ అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు డాక్టర్ రమేష్‌బాబు, వెంకయ్య, వాసు తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే విజయశ్రీ



సూళ్లూరుపేట, డిసెంబర్ 25 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని పాలవల్లివారి వీధిలో గల షారోన్ చర్చిలో బుధవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. కేక్‌కట్ చేసి క్రిస్మస్ సంబరాల్లో పాలు పంచుకున్నారు. కరుణ, ప్రేమకు ప్రతిరూపం ఏసుక్రీస్తు అని, ఏసు క్రీస్తు బోధించిన సన్మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకుంటే ప్రపంచంలో శాంతిపూర్వక వాతావరణం ఏర్పడుతుందని ఆమె చెప్పారు. అలాగే నియోజకవర్గంలోని క్రిస్టియన్ సోదర సోదరీమణులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని లూథరన్ మిఖైల్ చర్చి, ఇతర ప్రార్ధన మందిరాల్లో క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి. టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, మాధవనాయుడు, ఐవి సురేష్, అలవల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తగ్గేదేలే..అంటున్న బెల్ట్ సాపు నిర్వాహకులు

దొరవారిసకరతం డిసెంబర్ 25 ప్రభాతవార్త :తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలో ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన రెండు మద్యం దుకాణాలను అధికారికంగా కేటామించడం జరిగింది.కాని అనధికారికంగా మండల పరిధిలోని 22 పంచాయతీలలోని ప్రతి గ్రామంలో బెల్ట్ సాపులు నిర్వహిస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు.మండల పరిధిలో ఇప్పటికీ సురక్షిత మంచినీరు లేని గ్రామాలు చాలానే ఉన్నాయికాని బెల్ట్ సాపులు మాత్రం వీధికొకటి దర్శనమి స్తున్నాయని పలువురు వాపోతున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక వైపు బెల్ట్ సాపులపై ఉక్కుపాదం మోపాలంటు ఎక్సైజ్ శాఖకు పదే పదే ఆదేశాలను ఇస్తున్నపటికి వారి పనితీరులో ఎలాంటి మార్పు లేదని స్థానిక ప్రజలు,మహిళలు వాపోతున్నారు.ప్రతి గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్ మాఫియా జారుగుతున్నా ఎక్సైజ్ పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై మండల, నియోజకవర్గ ప్రజలు పలు అనుమానాలను వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఎస్.పి సుబ్బరాయుడు ప్రత్యేకదృష్టినిపెట్టి బెల్ట్ సాపులపై ఉక్కుపాదం మోపాలని దొరవారిసత్రం మండల ప్రజలు,మహిళలు వాపోయారు.

## శ్రీసిటీ పరిధిలో భూసేకరణపై సమావేశం



సూళ్లూరుపేట, డిసెంబర్ 25 ప్రభాతవార్త: సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కిరణ్మయి అధ్యక్షతన డివిజన్ పరిధిలోని సత్యవేడు మండలం ఇరుగాళం, కొల్లాడం, పెద్దేటిపాకం గ్రామాల్లో శ్రీసిటీకి సంబంధించి నూతనంగా పరిశ్రమలు స్థాపించేందుకు వ్యవసాయ భూములను రైతుల నుంచి సేకరించాలని నిర్ణయిం చారు. ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులతో ఆర్డీఓ ప్రభుత్వ ఆదేశాలను వివరించారు. రైతుల నుంచి భూములను తీసుకొని, భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన నష్టపరిహారం అందించడంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రైతులకు హామీ ఇచ్చి భూసేకరణకు సహకరించాలని కోరేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు ఇందుకు సహకరించాలని ఆర్డీఓ కిరణ్మయి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఓ రవికుమార్, టివి సుబ్రహ్మణ్యం, సత్యవేడు తహశీల్దార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఫ్లెమింగో ఫెస్టివల్ తేదీలు మార్పు

సూళ్లూరుపేట, డిసెంబర్ 25 ప్రభాతవార్త: సూళ్లూరుపేట కేంద్రంగా నిర్వహించతలపెట్టిన ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సంబంధించి ముందుగా అనుకున్న తేదీలు కాకుండా ప్రత్యామ్నాయంగా వేరే తేదీలలో నిర్వహించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించారు. ఇందుకు సంబంధించి జనవరి 10, 11, తేదీల్లో కాకుండా, 17,18,19తేదీలలో నిర్వహించాలని యోచిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి అనుమతి లభించగానే అధికారిక ప్రకటన జరిగే అవకాశాలు ఉన్నాయి. జనవరి 10వ తేదీ వైకుంఠ ఏకాదశి, భోగి, సంక్రాంతి పండుగలు ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

## చర్చిల్లో క్రిస్మస్ సందడి



కోట, డిసెంబర్ 25 ప్రభాతవార్త: విశ్వశాంతి, సోదరభావానికి క్రిస్మస్ ప్రతీక అని విద్యానగం లోని హోలీప్రేయర్ చర్చి బిషప్ డాక్టర్ రెవ.ప్రదీప్ కుమార్ అన్నారు. బుధవారం కోట మండలంలోని వివిధ గ్రామాల్లో క్రిస్మస్ పండుగను క్రిస్టియన్ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. విద్యానగర్ లోని హోలీప్రేయర్ చర్చిలో భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ప్రదీప్‌కుమార్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో సామరస్యం, సహనం, సేవాస్ఫూర్తి మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేరి సుజాత, జూనియర్ పాస్టర్ స్వరూప్ (డిన్ని), సంఘ సభ్యులు పాల్గొన్నారు. మద్దాలి, గూడలి, కోట, రంగన్నగుంట, చంద్రశేఖరపురం, కొత్తపాలెం తదితర గ్రామాల్లోని చర్చిల్లో ఏసు రాకను స్వాగతిస్తూ గీతాలు ఆలపించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## కలెక్టర్ గారూ.. న్యాయాన్ని బతికించండి

**- ఆర్టీసీ దుకాణదారుల ఆవేదన**

కోట, డిసెంబర్ 25 ప్రభాతవార్త: కోటలో 1996 సంవత్సరంలో ఆర్టీసీ అధికారులు 26 వ్యాపారులకు ఖాళీ స్థలం కేటాయించారని దుకాణదారులు చెప్పారు. అయితే ప్రస్తుతం దుకాణదారుల సమస్య కోర్టులో ఉండగా, ఇక్కడ పంచాయతీ అధికారులు నిబంధనలు ఉల్లంఘించి తమను అడుగడుగునా ఇబ్బందుల పాల్జేస్తున్నారని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం దుకాణదారులు స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ తమకు జిల్లా కలెక్టర్ అయినా జోక్యం చేసుకొని ఆదుకోవాలని కోరారు. న్యాయస్థానంలో కేసు ఉన్నప్పుడు దుకాణాలకు వేలంపాటలు నిర్వహిస్తామని అధికారులు ప్రకటనలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ సమస్యను పలుమార్లు గ్రీవెన్స్‌డేలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు సైతం విన్నవించామని తెలిపారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మంచి మనసుతో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని తమ దుకాణాలకు శాశ్వతమైన భద్రత కల్పించాలని వారు కోరారు. కలెక్టర్‌కు రెండు చేతులెత్తి దండం పెడుతున్నామని వారు వేడుకున్నారు.

## గ్రామ గ్రామాన తెదేపాను బలోపేతం చేస్తాం

కోట,డిసెంబర్ 25 ప్రభాతవార్త: గూడూరు నియోజకవర్గంలో తెదేపాను గ్రామ గ్రామాన బలోపేతం చేస్తామని నియోజకవర్గ టిఎన్‌సీ సెల్ అధ్యక్షులు చెంగాలరావు అన్నారు. బుధవారం కొత్తపట్నం పంచాయతీలోని సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తెదేపా సభ్యత్వం బడుగు బలహీన వర్గాలకు బాసటగా నిలుస్తుందన్నారు. శాసన సభ్యులు డా.పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుకుగా కొనసాగుతోందన్నారు.

## ప్రధానిగా వాజ్ పేయి సేవలు దేశానికి ఆదర్శనీయం



వెంకటగిరి, డిసెంబర్ 25 ప్రభాతవార్త: దివంగత మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్ పేయి భారతదేశ పరిపాలనలో ప్రపంచానికి దిక్సూచి అయ్యారని గూడూరు అర్బన్ మండల పార్టీ బిజెపి అధ్యక్షులు బాలకృష్ణనాయుడు పేర్కొన్నారు. బుధవారం గూడూరు రెండో పట్టణంలోని బాలసదనం హాస్టల్లో చిన్నారుల మధ్య మాజీ ప్రధాని, బిజెపి నాయకులు వాజ్‌పేయి శతజయంతి వేడుకలను బిజెపి గూడూరు అర్బన్ మండల పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో బిజెపి నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి యువ నాయుకులు దయాకర్, జి.వి.నాయుడు, గాలి ప్రకాష్ నాయుడు, గుమ్మడి శ్రీనివాసులు, బాలకృష్ణ గౌడ్, కటికాల సురేష్, నిరంజన్, శివ, నాగూర్, బాలసాదనం వసతి గృహ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## చిట్టమూరు మండలంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**- 30 కుటుంబాలకు చీరలు, పండ్లు, స్వీట్లు పంపిణీ**



చిట్టమూరు, డిసెంబర్ 25 ప్రభాతవార్త : చిట్టమూరు మండలంలో బుధ వారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆరూరు పంచాయతీలోని పెద్ద దళితవాడలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదేశాలతో మండల టిడిపి కన్వీనర్ కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ఆరూరు గిరినాయుడు సహకారంతో క్రిస్మస్ సందర్భంగా చీరలు,పండ్లు,స్వీట్లు పంపిణీ చేశారు. ఆరూరు ఎంపిటిసి భార్గవి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ఆరూరు గిరినాయుడు మాట్లాడుతూ క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీస్తు పుట్టినరోజు త్యాగానికి మారుపేరు అని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సారి కూడా 30 కుటుంబాలకు చీరలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేసినట్లు తెలియజేశారు. అనంతరం గిరినాయుడు, భార్గవిలను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బల్లి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో లోపించిన పారిశుధ్యం పట్టించుకోని అధికారులు



వెంకటగిరి, డిసెంబర్ 25 ప్రభాతవార్త : పట్టణంలో పారిశుధ్యం లోపించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకొని ఉంది. ఎక్కువగా 14వ వార్డు బొగ్గుల మిట్ట, ధర్మాపురం, నరసింహారావు వీధి, ముత్తరాశిపాలెం, కాసిపేట ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా కౌన్సిలర్ ఆరి శంకరయ్య 14వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. గత పది రోజుల నుంచి ఎక్కడ వేసిన చెత్త, కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించక పోవడం వల్ల వల్ల విపరీతమైన దోమలు మరియు జ్వరాలు వల్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత నాలుగు మాసాల నుంచి వెంకటగిరి పురపాలక సంఘమునకు రెగ్యులర్ కమిషనర్, మేనేజరు, అకౌంటెంట్, టౌన్ ప్లానింగ్ అధికారి, గుమస్తాలు లేరు, ఉన్న సిబ్బంది చూస్తే వెంకటగిరి పురపాలక సంఘం నందు జీతభత్యాలు తీసుకుంటూ మరియొక మున్సిపాలిటీ నందు పనిచేస్తూ ఉన్నారు. ఈ సమస్యను వెంటనే సత్వర పరిష్కారం చేయవలసిందిగా కోరుచున్నాను. సమస్యను తిరుపతి జిల్లా కలెక్టర్ వారు సదరు వెంకటగిరి మున్సిపాలిటీ నందు నెలకొన్న సమస్యలను మరియు సచివాలయ శానిటరీ సెక్రెటరీల యొక్క ప్రవర్తన తీరులను పరిశీలించి తగు చర్యలు తీసుకొనవలసినదిగా కోరుచున్నాను.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వెంకటగిరి, డిసెంబర్ 25 ప్రభాతవార్త : ప్రాంతాలని చర్చిలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. వెంకటగిరి పట్టణం కాసిపేట వద్ద పరిశుద్ధ పేతులూరు చర్చిలో పాస్టర్ దయాకర్ క్రీస్తు జననం తచ్చరాంశాలను వివరించారు. ఏసుక్రీస్తు పాపులను రక్షిస్తారని తెలిపారు. చర్చి ప్రార్థనలలో పలువురు క్రిస్టియన్స్ పాల్గొన్నారు. ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఫోటో 25 వెంకటగిరి 01. చర్చిలో ప్రార్ధన నిర్వహిస్తున్న పాస్టర్ దయాకర్

## సుధాకర్ మృతికి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే

వెంకటగిరి, డిసెంబర్ 25 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లాపూరి సుధాకర్ గుండెపోటుతో మృతి చెందారు. సుధాకర్ మృతికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సుధాకర్ తెలుగుదేశం పార్టీలో కీలకంగా పనిచేసే నాయకుడు అని తెలిపారు. ఆయన వచ్చి పార్టీకి తీరని లోటు అని చెప్పారు. రాష్ట్ర టిడిపి కార్యదర్శి జి. నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కె వి కె ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు తదితరులు సంతాపం తెలిపారు.

## వెంకటేష్‌ని సన్మానించిన పాశం



గూడూరు, డిసెంబర్ 25 ప్రభాతవార్త: రాష్ట్రంలో జరుగుతున్న సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో టాప్ రెఫరల్‌గా గూడూరు నియోజకవర్గం నుండి మూడవ స్థానంలో గూడూరు విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు అసనా పురం వెంకటేష్ రావడంతో గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్, పెంచలకోన మాజీ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ తానంకి నానాజీ తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. శాసనసభ్యుల మాట్లాడుతూ ముందుగా నియోజక వర్గం లోని క్రైస్తవ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే క్రిస్టియన్ సెల్ నాయకులు ఇజ్రాయిల్ కుమార్ ఆధ్వర్యంలో పెద్దలు గంగాప్రసాద్ సహకారంతో జరిగిన ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాష్ట్ర కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్, పులిమి శివకుమార్, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, మస్తాన్‌నాయుడు, వాటంబేటి శివకుమార్, యువత నాయకులు ప్రణీత్ యాదవ్, ముఫ్వ చరణ్, వేముల సునీల్, గుండల సందీప్, అరుణ్ కుమార్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్‌పిఎల్‌సి చర్చిలో క్రిస్మస్ వేడుకలు



గూడూరు, డిసెంబర్ 25 ప్రభాతవార్త : క్రిస్మస్ పండుగ సందర్భంగా గూడూరు పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పెద్ద చర్చ్ అయిన ఎస్‌పిఎల్‌సి చర్చిని అందంగా అలంకరించారు. క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేశారు. గూడూరు పట్టణంలోని ఎస్‌పిఎల్‌సి చర్చిలో క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. యేసు గీతాలను ఆలపించారు. పాస్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ లోకరక్షణ కొరకు ప్రభు జన్మించారని తెలుపుతూ దైవ సందేశాన్ని అందించారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. గూడూరు పట్టణంలోని శాంతినగర్ లో ఉన్న హోసన్నా మందిర్‌లో క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పండుగ విశిష్టతను తెలియజేస్తూ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాస్టర్ కాంతారావు పండుగ విశిష్టతను తెలియజేస్తూ దైవ సందేశాన్ని అందించారు.

## పేటలో ఘనంగా క్రిస్‌మస్ వేడుకలు

నాయుడుపేట, డిసెంబర్ 25 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని పలుగ్రామాల్లో ప్రజలు క్రిస్‌మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నాయుడుపేట పట్టణం,మండలంలోని గ్రామాల్లో ఉన్న చర్చిలను పండుగ పర్వదినం పురస్కరించుకొని రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.క్రిస్‌మస్ పండుగ సందర్భంగా ప్రజలు కొత్తబట్టలు ధరించి ఒకరినొకరు పలకరించుకొంటూ క్రిస్‌మస్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ప్రజల తాకిడితో చర్చలు కిటకిటలాడాయి.

## నాయుడుపేటలో వర్షం

నాయుడుపేట, డిసెంబర్ 25 ప్రభాతవార్త: నాయుడుపేట మండలంలో మంగళవారం ఉదయం నుండి వర్షం పడుతుంది. ఈవర్షంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాయుడుపేటలో వర్షాలు పడుతున్నాయి. స్వర్ణముఖి-మామిడికాలువ పరివాహక ప్రాంతాల్లో ఉన్న పంటపొలాలు వరదముప్పు నుండి ఇప్పుడిప్పుడే కొలుకుంటున్న సమయంలో మళ్ళీ వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు వరదముప్పు ఎక్కడ పొంచిఉందోనని ఆందోళన చెందుతున్నారు. ముంపుప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. నాయుడుపేట పట్టణం, గ్రామాల్లో పారిశుద్యం లోపించడంతో విషజ్వరాలు ప్రబలుతాయని ప్రజలు వాపోతున్నారు.

## కూటమి ప్రభుత్వంలో విద్యుత్ ప్రాజెక్టులకు మోక్షం

**- మాజీ ఎమ్మెల్సీ గౌనివారి**



శాంతిపురం, డిసెంబర్ 25 ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక విద్యుత్ ప్రాజెక్టులకు సిఎం చంద్ర బాబునాయుడు మోక్షం కలిగిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివా సులు పేర్కొన్నారు. అచ్యుతాపురంలో 85వేల కోట్లతో మెగా పవర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారన్నారు. ఈ ప్రాజెక్టుకు 2014-19లోనే అనుమతులు మంజూరయ్యాయని వైకాపా పాలనలో ప్రాజెక్టు తెరమరుగైందన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభమైతే 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే అల్లూరి జిల్లాలో అప్పర్ సీలేరు ప్రాజెక్టుకు 1753కోట్లు, సిఆర్‌డిఏ పరిధిలో లైన్ల మార్పుకు 1042కోట్లు, పలు ప్రాంతాల్లో భూగర్భ కేబుల్ కోసం 824కోట్లు కేటాయించారన్నారు. రాష్ట్రంలో ఎపిజెన్‌కో, ఎన్‌హెచ్‌పిసిలు 5070మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయన్నారు. రానున్న మూడేళ్లలో 500 బయో ఇంధన ప్లాంట్లను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

## కాణిపాకంలో మళ్ళీ భారీగా పెరిగిన భక్తుల రద్దీ

కాణిపాకం, డిసెంబర్ 25 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి అలయం బుధవారం పోటెత్తిన భక్తుల రద్దీతో జనసంద్రంగా తయారైంది. సాధారణంగా





ఆలయంలో వారంతపు రోజులు, వరుస సెలవు రోజుల్లో భక్తుల రద్దీ వుంటుంది. అయితే గత కొద్ది రోజులుగా కార్తీకమాసం సందర్భ ంగా శబరిమల ఆలయంలో దర్శనాలు ప్రారంభం కావడంతో అయ్యప్ప దర్శనం కోసం వెళ్ళిన భక్తులు తిరుగు ప్రయాణంలో పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా కాణిపాకం ఆలయ దర్శనార్థం వస్తున్నారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు కాణిపాకం స్వామిదర్శనం కోసం భారీగా తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప భక్తులు తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో విపరీతమైన రద్దీ నెలకొంది. దీనితో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## పేదలకు అందని ద్రాక్షలా సంక్షేమ పథకాలు

సోమల, డిసెంబర్ 25 ప్రభాతవార్త : ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో నిరుపేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారు.



కొందరి నాయకుల స్వార్థం, అధికారుల నిర్లక్ష్యం వెరసి సంక్షేమ పథకాలు పేదలకు అందని ద్రాక్షలాగని మారుతున్నాయి. సోమల మండలంలో మితిమీరిన రాజకీయ జోక్యం వారికి వంత పాడుతున్న అధికార గణం వల్ల అర్హులైన వారికి మినీ గోకులాలు నిర్మించుకునేందుకు అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయి. 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ ఇర్లపల్లిలో బాదూరి రెడ్డమ్మ అనే గిరిజన మహిళలకు మినీ గోకులం నిర్మించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. రెండు నెలల క్రితం మండలానికి 50 మినీ గోకులాలు మంజూరు అయ్యాయి. అందులో గిరిజన కోటాలో రెడ్డమ్మకు గోకులం మంజూరు అయింది. రెడ్డమ్మకు అర్ధ ఎకరా పొలం ఉంది. అందులో ఆరు పశువులు నేపుకుంటూ జీవనం సాగిస్తోంది. పశువులకు సరైన నీడ వసతి లేకపోవడంతో వర్షం వచ్చిన చెట్ల కిందనే బురదలో వాటిని ఉంచుతున్నారు. వీటిని చూసి చెలించిన పశుసంవర్ధక శాఖ అధికారులు రెడ్డమ్మ గోకులం నిర్మించుకునేందుకు జిల్లా అధికారులకు సిఫార్సు చేశారు. కలెక్టర్ అనుమతులు మంజూరు చేశారు. అయినా స్థానిక అధికారులు మాత్రం కనికరించకపోవడంతో పశువులు ఎండకు ఎండుతూ వర్షానికి తడిసి మూగగా రోధిస్తున్నాయి. మార్కింగ్ ఇస్తే గోకులం నిర్మించుకుంటామని పలుమార్లు అధికారులు చుట్టూ తిరుగుతున్న వారు స్పందించిన పాపాన పోవడం లేదు. జిల్లా అధికారులు స్పందించి రెడ్డమ్మ గోకులం నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## యుద్ధ ప్రాతిపదికపై కౌంటర్లు ఏర్పాటు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 25 ప్రభాతవార్త: దేవస్థానం అధికారులు గత కొన్ని సంవత్సరాలుగా భక్తులకు సన్నిధివీధిలోని గేట్ ద్వారా ప్రవేశాలు అలవాటు చేసారు. ప్రస్తుతం విఐపిలు,టూరిస్టులు, కార్లలో వచ్చే వారందరూ సన్నిధివీధిలోని నాలుగవ గేటు నుంచి ప్రవేశిస్తున్నారు.దాంతో సన్నిధివీధిలో ట్రాఫిక్ నరకంగా మారింది. ఓ వైపు ఆటోలు,మరో వైపు కార్లు, ఇంకొక వైపు టూరిస్టు,టూరిజం బస్సులతో పాటు వేలాది ద్విచక్రవాహనాలతో సతమతమౌతున్నారు. ప్రతి రోజూ ఈ బాధలు తప్పటం లేదు, దేవస్థానం సంస్కరణలకు శ్రీకారం చుట్టినా పరిస్థితి చక్కబడటం లేదు.

**యుద్ధ ప్రాతిపదికపై కౌంటర్ల ఏర్పాటు:**



శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణలో అడుగుపెడితే బయటి ప్రపంచాన్ని మరచిపోయేలా తీర్చి దిద్దుటకు ప్రస్తుత ఇఓ టి.బాపిరెడ్డి ప్రణాళికలు రచించుకొని అమలుకు చర్యలు చేపట్టారు. రెండు చోట్ల కౌంటర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.అంతేకాక పిఆర్‌ఓ, సిఆర్‌ఓ కార్యాలయాలు కూడా బయటే ఉండాలని భావిస్తున్నారు.ఈ నేపధ్యంలో పనులు పనులు, మొదట నాలుగవ గేటు వద్ద కౌంటర్ల పనులను చక చకా సాగిస్తున్నారు. లోపలకు ఎలాంటి వాహనాలు అనుమతించక పార్కింగ్ కూడా బయటే ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే తేరువీధి నుంచి బిక్షాల గాలిగోపురం ద్వారా ప్రవేశించే భక్తుల కోసం కూడా రంగుల గోపురం రెండవ గోపురం మధ్య కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. సన్నిధివీధిలోని శ్రీరామమందిరం నుంచి టూరిస్టు బస్టాండు వరకు ద్విచక్రవాహనంలో వెళ్ళాలంటే నరకమే అన్నట్లు మారింది.

## జనవరి 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుమల,డిసెంబర్ 21ప్రభాతవార్తప్రతినిధి : వైకుంఠ ఏకాదశి పర్వదినానికి ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శ్రీవారి ఆలయంలో నిర్వహిస్తారు. జనవరి 10వతేదీ వైకుంఠ ఏకాదశి పర్వదినానికి ముందు వచ్చే మంగళవారం జనవరి 7వతేదీ ఆలయంలో ఉదయం మహాయజ్ఞంలా ఆలయ శుద్ధి చేపడతారు. ఉదయం 6గంటల నుండి 11గంటల వరకు ఆనందనిలయంలోని మూలవిరాట్టు సన్నిధి నుండి మహద్వారం వరకు, ఉప ఆలయాలు పూర్తిగా పవిత్ర జలంతో శుద్ధిచేస్తారు. పూజా సామాగ్రిని కూడా కడుగుతారు. అనంతరం స్వామివారికి అలంకరణ చేసి ప్రత్యేక నివేదనలు పూర్తయిన వెంటనే భక్తులను దర్శనానికి అనుమతినిస్తారు. ఈ సందర్భంగా 7వతేదీ మంగళవారం విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు.

## తిరుమలలో వైకుంఠ ఏకాదశికి పటిష్ట భద్రత చర్యలు

**- వైకుంఠ ఏకాదశి దర్శనం టోకన్లు జారీకి 9 ప్రాంతాలలో కేంద్రాలు ఏర్పాటు**

**- జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు**





తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 25 ప్రభాతవార్త :తిరుమలలో వైకుంఠ ఏకాదశికి పటిష్ట భద్రత చర్యలు చేపట్టామని, వైకుంఠ ఏకాదశి దర్శనం టోకన్లు జారీకి 9 ప్రాంతాలలో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పి.ఎల్.సుబ్బరాయుడు పేర్కొన్నారు. బుధవారం జనవరి 10వ తేది నుండి 19వ తేది వరకు వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలను పురస్కరించుకుని పోలీస్ అధికారులు, టిటిడి ఈవో శ్యామలారావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో గౌతమి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీధర్ వారితో జిల్లా ఎస్పి సుబ్బరాయుడు భద్రతపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం నగరంలో 9 ప్రాంతాలలో టోకెన్ జారీ చేయు కేంద్రాలను టీటీడీ వారు ఏర్పాటు చేశారని అక్కడ రద్దీకి తగ్గట్టు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైకుంఠఏకాదశి, ద్వాదశి పర్వదినాలతో పాటు 10 రోజుల పాటు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనం భక్తులకు చేసుకొనే విధంగా ఏర్పాట్లను టీటీడి చేసిందని, స్థానిక ప్రజలే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి అశేష భక్త జనం వచ్చే అవకాశం ఉన్నందున భద్రతాపరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని అన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని టిటిడి వారి నియమ నిబంధనలు, సూచనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు వెంకట్రావు పరిపాలన, రవిమనోహర్ ఆచారి శాంతి భద్రత, గిరిధర ఎస్పి డిఎస్పి, తిరుపతి నగర పరిధిలోని డిఎస్పిలు, సిఐలు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

## ముదరందొడ్డి సర్పంచ్‌నా.. మజాకా !!

**- దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా.. ఫామ్‌హౌస్ నిర్మాణాలు - చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు**



వి.కోట, డిసెంబర్ 25 ప్రభాతవార్త : కాదేదీ కబ్జాకు అనర్హం అనే రీతిలో మండలంలోని ముదరందొడ్డి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఏకంగా ప్రభుత్వ భూమికే ఎసరు పెట్టేశారు. దరా జ్గా కబ్జా చేసిన ప్రభుత్వ స్థలంలో సదరు సర్పంచ్ కుటుంబీకులు ఏకంగా ఫామ్‌హౌస్ నిర్మిస్తుంటే పట్టించుకోవాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. వి.కోట - పేర్నంబట్ జాతీయ రహదారిలోని సుద్దలకుప్పం గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదురుగా అదే గ్రామానికి చెందిన పలువురికి దరఖాస్తు భూములు ఉన్నాయి. పక్కనే దెయ్యాల బండగా పిలుచుకునే ప్రభుత్వ భూమి ఐదు ఎకరాల్లో ఉంది. ఈ దెయ్యాల బండ చుట్టూ ఉన్న రైతులనుంచి ముదరందొడ్డి సర్పంచ్ మరియు అతని కుటుంబీకులు కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో వారి కన్ను దెయ్యాల బండ ప్రాంతంపై పడింది. ఇంకేముంది..సుమారు ఎకరం బండ ప్రాంతాన్ని కబ్జా చేసి మట్టితో పూడ్చేశారు. బండ చుట్టూ ప్రహరీగోడ నిర్మించి బండపై ఫామ్‌హౌస్ నిర్మాణానికి పునాదులు సైతం వేసేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు ఆవైపుకు పోయిన దాఖలాలు మాత్రం లేవు. సదరు సర్పంచ్‌కు కొంతమంది అధికార పార్టీ నేతల మద్దతు ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు జోరుగా చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే ప్రభుత్వ భూములు కాజేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదలు ప్రభుత్వ భూముల్లో అడుగు పెడితే నానా యాగీ చేసే రెవెన్యూ అధికారులు ఈ వ్యవహారంలో మిన్నకుండిపోవడంలో మతలబు ఏంటో ఆ దేవుడికే ఎరుక. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలకు గురైన దెయ్యాల బండను ఆ క్రమణదారుల చెరనుంచి తప్పించి స్వాధీనం చేసుకోవాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.